

కొత్తగూడెం ప్రకాశం మైదానంలో స్వాతంత్ర్య వేడుకల ఏర్పాట్లు

ప్రత్యేక కథనాలు మధ్యపేజీల్లో

ఈనాడు
భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం 15 ఆగస్టు 2017 | 16 పేజీలు

- మరుగుదొడ్ల నిర్మాణం పూర్తికాకుండానే ఓడీఎఫ్ ప్రకటన
- కొత్తగూడెం పురపాలకంలో వింత పోకడలు
- చోద్యం చూస్తున్న జిల్లా అధికార యంత్రాంగం



12వ వార్డులో ఇంకా పునాది తవ్వకాల దశలోనే మరుగుదొడ్డి నిర్మాణ పనులు

ఇలా చేస్తే అభ్యంతరమే..

ఈనాడు పరిశీలన

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే

'బహిరంగ మల, మూత్ర విసర్జన లేని వార్డుగా ప్రకటించాలంటే పూర్తి స్థాయిలో అందరికీ మరుగుదొడ్డి నిర్మాణమై ఉండాలి. అన్ని సౌకర్యాలతో ఇది పూర్తి కావాలి. ఇక వార్డులో మరుగుదొడ్డి నిర్మాణం లేని వారంటూ లేకుండా ఉన్నారని నిర్ధరించుకుని ఓడీఎఫ్‌గా అర్హత సాధించినట్లుగా పురపాలక యంత్రాంగం ప్రకటించాలి. ఆ తరువాత 'మా వార్డులో ఇంకా మరుగుదొడ్ల నిర్మాణం కావాల్సి ఉంది. లబ్ధిదారులుగా ఉన్నా మా ఇళ్లలో సర్వేలు చేయలేదు. మా ఇంట్లో నిర్మాణాలు చేపట్టాలం'టూ అభ్యంతరం వ్యక్తం చేస్తూ ప్రజలు అధికారులకు సూచించాలి. కానీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం ప్రథమశ్రేణి పురపాలకంలో మాత్రం వింతపోకడలు కొనసాగుతున్నాయి. ఇంకా పునాదులు తీయని వార్డులున్నాయి. బేస్‌మెంట్ దశలోనే నిలిచిపోయిన నిర్మాణాలు వెక్కిరిస్తున్నాయి. కేవలం ఆకారానికి నిర్మాణాలుగా దర్శనమిస్తున్న కట్టడాలు కళ్లెదుటే కనిపిస్తున్నాయి. హడావిడి నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి. బేసిన్, పైపులైన్, సెప్టిక్ ట్యాంకు, నిర్మాణంపై రేకులు, తలుపులు ఏర్పాటు చేయనివి ప్రత్యక్షంగా అగుపిస్తూనే ఉన్నాయి. ఇన్నీ లోపాలున్నా ఆదివారం పురపాలక కమిషనర్ మాత్రం ఓడీఎఫ్‌ను హడావిడిగా ప్రకటించారు. అభ్యంతరాలు తెలపమన్నారు. పై రీతిన హడావిడి పనులు చేస్తే అభ్యంతరాలుండవా?

కౌన్సిలర్లతో సంతకాలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతిష్ఠాత్మక పథకం 'స్వచ్ఛ భారత్- స్వచ్ఛ తెలంగాణ'. కొత్తగూడెంలో దీని ప్రతిష్ఠ దెబ్బతింటోంది. అధికారులు మసిపూసి మారెడు కాయ మంత్రాన్ని అనుసరిస్తున్నారు. మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తిస్థాయిలో జరగకుండానే స్వచ్ఛ వార్డులుగా ప్రకటించేస్తున్నారు. అందుకు అవసరమైన ఆమోదాన్ని కౌన్సిలర్ల నుంచి పొందుతున్నారు. రెండేళ్లుగా కొనసాగుతున్న బహిరంగ మల, మూత్ర విసర్జన నిర్మూలన పథకాన్ని ఆది నుంచీ నిర్లక్ష్యం చేస్తూ ఈ నెల 5వ తేదీ తరువాత మేల్కొన్నారు. పనులను వేగిరం చేసి పూర్తికాకుండానే లక్ష్యాన్ని ఛేదించినట్లుగా చిత్రీకరించేందుకు ప్రయత్నాలు సాగిస్తూనే ఉన్నారు. అందులో భాగంగానే తమ తమ వార్డుల్లో మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, బహిరంగ మల, మూత్ర విసర్జన లేని వార్డుగా రూపుదిద్దుకున్నట్లుగా పురపాలక అధికారులు వార్డు కౌన్సిలర్లతో సంతకాలు చేయించేస్తున్నారు. కొంతమంది కౌన్సిలర్లు సంతకాలు చేసి మెప్మా సిబ్బందికి సైతం అందచేశారు. వాస్తవానికి సంతకాలు చేసిచ్చిన వార్డుల్లో

మిగతా 2లో

రెండేళ్ల క్రితం ఇదే నెలలో తమ్ముణ్ణి కోల్పోయిన వైద్యురాలు

ఇప్పుడు భర్త, తల్లి ప్రాణాలు అనంత వాయువుల్లో...

అదే విషాదం



కుమారుడు హర్ష పెళ్లి నిశ్చితార్థ వేడుకలో విజయ్‌కుమార్ దంపతులు (దాచిన చిత్రం)

కొత్తగూడెం రామవరం, న్యూస్‌టుడే

రెండేళ్ల క్రితం సరిగ్గా ఇదే నెలలో సంభవించిన రోడ్డు ప్రమాదంలో తన తమ్ముణ్ణి పోగొట్టుకుందా వైద్యురాలు. ఇప్పుడు అదే నెలలో రోడ్డు ప్రమాద రూపంలోనే తన భర్తనూ, తల్లిని రోడ్డు కోల్పోయింది. తానూ మృత్యువుతో పోరాడుతోంది. మేనకోడలికి శనివారం వైభవంగా వివాహ వేడుకను జరిపించి, ఆ వేడుకలో భాగంగానే చేస్తున్న ప్రయాణంలోనే ఆమె భర్త, తల్లి మృత్యువాత పడటం హృదయ విదాకరమైంది. నల్గొండ జిల్లా కట్టంగూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కొత్తగూడెం పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యురాలు ఝాన్సీలక్ష్మి భర్త మద్దికాయల విజయ్‌కుమార్, వైద్యురాలి తల్లి సావిత్రీబాయి దుర్మరణం పాలయ్యారు. తీవ్రంగా గాయపడ్డ ఝాన్సీలక్ష్మి హైదరాబాద్‌లో చికిత్స పొందుతోంది. కొత్తగూడెం వాసి డా. ఝాన్సీలక్ష్మి ప్రసూతి వైద్య నిపుణురాలు. కాన్పులకు సంబంధించి పలు సంక్లిష్టమైన

మిగతా 2వ పేజీలో

పెద్దాసుపత్రిలో నిఘా నేత్రాలు



- భద్రాచలం ప్రాంతీయ ఆసుపత్రికి హంగులు



భద్రాచలం, న్యూస్‌టుడే

భద్రాచలం ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో కట్టుదిట్టమైన నిర్వహణ నిమిత్తం అధికారులు చర్యలు చేపట్టారు. ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఏపీ సరిహద్దు ప్రాంతాల వారితో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వాసులకు ఇక్కడ ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నందున దీనిపై ప్రభుత్వం సైతం దృష్టి సారించింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ఉండేందుకు ఈ ప్రాంగణంలో 18 చోట్ల సీసీ కెమెరాలను అమర్చనున్నారు. అన్ని వార్డుల పరిస్థితి తెలిసేలా ఖరీదైన కెమెరాలను బిగించేందుకు ప్రణాళిక సిద్ధమైంది. దొంగతనాలను అరికట్టడంతో పాటు పసిపిల్లల మాయం వంటి సంఘటనలకు తావు లేకుండా చూసేందుకు ఈ చర్యలకు సమాయత్తమయ్యారు. అవసరమైనప్పుడు పుటేజీని పరిశీలించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. సూపరింటెండెంట్ గానీ కార్యాలయ ఉద్యోగులు గానీ ఉండే గదుల్లో సీసీ కెమెరాల వ్యవస్థను అందుబాటులో ఉంచనున్నారు. అధికారులు స్థానికంగా లేనప్పటికీ మొబైల్ ఫోన్‌కు సీసీ వ్యవస్థను అనుసంధానం చేయడం వల్ల పర్యవేక్షణ పెంచే వీలుంది. ఇప్పటికే రెండు కెమెరాల పిల్లల వార్డులో ఉన్నాయి. ఇవి అంతంత మాత్రంగానే పని చేస్తుంటాయి. ఈసారి ఏర్పాటు చేసేవి అత్యంత సాంకేతిక విలువలతో కూడుకున్నవని సమాచారం. ఆసుపత్రి అభివృద్ధి చెందుతున్నందున సుదూర ప్రాంతాల నుంచి రోగులు వచ్చి చేరి చికిత్సలు పొందుతున్నారు. ఇంటి వద్ద ఉండే బంధువులకు వీరి ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవాంటే సరైన సదుపాయం లేదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని క్యాజువాల్టీలో 9640534046 నంబరుతో

మిగతా 2వ పేజీలో



మధిర పట్టణంలో శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలో చిన్నారుల సందడి

చిత్రాలు 16లో

ఇలా చేస్తే అభ్యంతరమే..

(మొదటిపేజీ తరువాయి) ఇంకా నిర్మాణ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. విచిత్రమేమింటే అసలు పునాది దశలోలేని నిర్మాణాలు సైతం దర్శనమిస్తున్నాయి. కమిషనర్ చూపిన లెక్కలకు వాస్తవ పరిస్థితుల్లో కన్పిస్తున్న పనితీరుకు ఎక్కడా పొంతన లేకుండాపోతోంది. అయినా కౌన్సిలర్లు మాత్రం ఓడీఎఫ్ ప్రకటనకు అంగీకరిస్తూ సంతకాలు ఎలా చేశారనే విషయం చర్చనీయాంశంగా మారుతోంది. అధికారులు సంతకాలు చేయించుకున్న కాగితాల్లో స్పష్టంగా మా వార్డుల్లో బహిరంగ మల, మూత్ర విసర్జన లేదని పేర్కొని ఉన్నా, మరోవైపు వార్డుల్లో మరుగుదొడ్ల నిర్మాణాలు అసంపూర్తిగా కన్పిస్తూనే ఉన్నా సంతకాలు చేసి చేతులు దులుపుకొన్నారు.

ఇవిగో సాక్ష్యాలు..

కొన్ని వార్డుల్లో స్వచ్ఛభారత్ మరుగుదొడ్ల నిర్మాణాలు విడ్డూరంగా గోచరిస్తున్నాయి.

- ◆ 21వ వార్డులో మంజూరైనవే అయిదు. అందులో రెండు అసలు పూర్తి కానేలేదు. మిగిలిన మూడు అసంపూర్తిగానే నిర్మితమయ్యాయి. అయినా ఆ వార్డులో మాత్రం ఎనిమిది పూర్తయినట్లు కమిషనర్ ప్రకటించేశారు.
- ◆ 9వ వార్డులో 19 నిర్మాణాలు చేయాల్సి ఉండగా రెండు పునాదుల దశలోనే ఉన్నాయి. మరికొన్ని బేస్‌మెంట్ వరకు నిర్మించి ఒదిలేశారు. మిగిలిన నిర్మాణాలు ఆయా దశల్లో కొనసాగుతూనే ఉన్నాయి.
- ◆ 12వ వార్డులో 60 పై చిలుకు నిర్మించాల్సి ఉండగా కేవలం 12 మాత్రమే పూర్తిస్థాయిలో నిర్మితమయ్యాయి. ఇంకా మిగిలినవి హడావిడిగా ముగ్గురు కాంట్రాక్టర్లను కేటాయించి పనులు కొనసాగిస్తున్నారు. అవి సైతం అసంపూర్తి దశలోనే ఉన్నాయి. కొన్నింటికి మాత్రం ఇప్పుడే పునాదులు తవ్వుతున్నారు.
- ◆ 16వ వార్డులో ఆకారానికి మరుగుదొడ్డిలా కన్పించేలా సిమెంట్ బిళ్లలతో నిర్మాణాలు పూర్తిచేశారు. ఇంకా వాటికి తలుపులు ఏర్పాటు చేయలేదు. పైకప్పు రేకులు పెట్టనేలేదు. కేవలం రింగులు తవ్వి(సెప్టిక్ ట్యాంక్) కోసం ఒదిలేశారు. మరుగుదొడ్డి నుంచి వాటికి ఇంకా కనెక్షన్లు సైతం ఇవ్వనేలేదు.
- ◆ 2, 3, 33వ వార్డుల్లో తొమ్మిది నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది.



9వ వార్డులో బేస్‌మెంట్ దశలోనే నిలిచిపోయిన మరుగుదొడ్డి నిర్మాణం

వంతపాట..

పురపాలక కమిషనర్ ప్రకటించిన ఓడీఎఫ్‌లో వార్డుల వారీగా పూర్తయినట్లు లెక్కల్లో చూపినా వాస్తవ పరిస్థితుల్లో మాత్రం పూర్తిస్థాయి నిర్మాణాలు ఎక్కడా జరగకపోవడం వింత గొలుపుతోంది. పర్యవేక్షణకు వచ్చిన అధికారులు సైతం కిమ్మనకుండా అధికారులు చూపిన లెక్కలకు మద్దతునిస్తూ ఓడీఎఫ్ ప్రకటనకోసం పురపాలకంలో ఏర్పాటు చేసిన ప్రాథమిక సమావేశంలో పాల్గొనడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇంకా నిర్మాణ దశలోనే ఉన్న వాటిని పూర్తయినట్లు ప్రకటించి చేతులు దులుపుకొన్న వైనానికి పరిశీలనాధికారిగా వచ్చిన వారు సైతం వంత పాడటం వింతగొలుపుతోంది.

లోపాలెన్నో..

ప్రస్తుతం పురపాలక వార్డుల్లో ఎక్కడ చూసినా మరుగుదొడ్ల నిర్మాణాలే కొనసాగుతున్నాయి. అయితే ఈ పనుల్లో మాత్రం నాణ్యత ప్రమాణాలు గాలికి ఒదిలేశారు. లబ్ధిదారుల ఇళ్లలో తవ్విన మట్టిని, అందులో వెళ్లిన బండ రాళ్లనే పునాదిరాళ్లుగా వినియోగించేస్తున్నారు. ఆయా వార్డుల్లో కొందరు విజయవాడకు చెందిన కాంట్రాక్టర్లు, స్థానిక కాంట్రాక్టర్లను ఏర్పాటుచేశారు. అధికారులు చూపిన లెక్కలకు సరిపడా నిర్మాణాలు పత్రాల్లో కన్పించేలా పనులను లాగించేస్తున్నారు. అందులో భాగంగానే గుత్తేదారులు పునాదిరాళ్లను సైతం వారే తీసుకొచ్చి నిర్మాణాలు చేపట్టాల్సి ఉండగా ఇంట్లో తేలిన బండరాళ్లతోనే మమ అన్పించేస్తున్నారు. అభ్యంతరం చేసిన లబ్ధిదారుల మాటలను పట్టించుకోకుండా కేవలం అడుగు మందం తవ్వకాలు చేపట్టి అక్కడక్కడి బండరాళ్లతోనే బేస్‌మెంట్‌ను తయారు చేస్తున్నారు. దాంతో నాణ్యత లోపిస్తోంది. రోజుల్లోనే నిర్మాణాలు పూర్తి చేయాలనే ఆతృతతో అధికారులు నాణ్యత ముఖ్యం కాదు నిర్మాణ ఆకారం ముందుగా కన్పించాలనే ధోరణిలో వ్యవహరించేస్తున్నారు.

మంజూరు పత్రాల జాడే లేదు..

పురపాలకంలో మరుగుదొడ్ల నిర్మాణానికి సంబంధించి మంజూరు(ప్రొసీడింగ్) పత్రాలను లబ్ధిదారులకు అందచేయడంలోనూ నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇంకా కొన్ని వార్డుల్లో మంజూరు పత్రాలు అందనేలేదు. ఎవరిని కదిలించినా ఎనిమిది రోజుల క్రితం ఎవరెవరో వస్తున్నారు. సత్వరంగా మరుగుదొడ్లు నిర్మించుకోవాలని చెబుతున్నారు. వాళ్లే వచ్చేస్తున్నారు. నిర్మాణాలు చేస్తున్నారంటూ వాపోతున్నారు. అధికారులు లబ్ధిదారులకు ఇవ్వాల్సిన మంజూరు పత్రాలను ఇవ్వకుండానే వారి రాజకీయ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. బహిరంగంగా జరుగుతున్న పరిణామాలకు, అధికారికంగా కాగితాల లెక్కలకు ఎక్కడ సారూప్యత ఉండటం లేదు. అయినా జిల్లా యంత్రాంగం నిస్తేజంగా వ్యవహరిస్తుండటం కొసమెరుపు.

తెరపై ఈనాడు

దుర్గా: ఫిదా పరమేశ్వరీ: లై
పూర్ణ: జయ జానకి నాయక
విశ్వరూప: నక్షత్రం
మహేశ్వరీ: నేనే రాజు నేనే మంత్రి

పాల్వంచలో..

వెంకటేశ్వర: జయ జానకి నాయక
వేణుగోపాల్: నేనే రాజు నేనే మంత్రి
శాంతి: లై

బ్రాయిలర్ ధరలు

(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర -74, రిటైల్ ధర -88, చికెన్ విత్ స్కిన్ - 123, చికెన్ స్కిన్‌లెస్ - 145

భద్రాద్రి రామాలయం వేళలు



ఉదయం 4.30 గంటలకు ఆలయం తలుపులు తెరచి సుప్రభాతం నిర్వహిస్తారు. ఆ తర్వాత ఆరాధన, సేవాకాలం, నివేదన ఉంటుంది. 7 గంటల నుంచి దర్శనాలు ఉంటాయి. ఉదయం 9 గంటలకు నిత్య కల్యాణం ప్రారంభం. మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల వరకు తలుపులు మూస్తారు. రాత్రి 9 గంటల వరకు దర్శనాలు ఉంటాయని ఈవో ప్రభాకర శ్రీనివాస్ తెలిపారు.

అభిషేకాలు.. ప్రతీ రోజు(ఆదివారం మినహా) భద్రుడి మండపంలో స్వామి వారి పాదాలకు అభిషేకం ఉంటుంది. ఇది ఉదయం 7 నుంచి 8.30 వరకు జరుగుతుంది. టిక్కెట్ ధర రూ.100. ప్రతీ ఆదివారం మూలవరులకు అభిషేకం జరుగుతుంది. టిక్కెట్ ధర రూ.1,100. ప్రతీ శుక్రవారం లక్ష్మీతాయారు అమ్మవారి సన్నిధిలో ఉదయం 8.30 నుంచి 9 వరకు అభిషేకం ఉంటుంది. టిక్కెట్ ధర రూ.100. ప్రతీ మంగళవారం ఆంజనేయ స్వామి వారికి అభిషేకం ఉంటుంది. ప్రతీ శనివారం నరసింహస్వామి వారి ఆలయంలో ఉదయం 9 నుంచి 10 వరకు అభిషేకం ఉంటుంది. టిక్కెట్ ధర రూ.100.

శాశ్వత సేవలు(పదేళ్లకు పరిమితం)

శ్రీరామ నవమి మినహా దాత కోరిన రోజు స్వామి వారి కల్యాణం చేపించవచ్చు. ఇలా ఏడాదికి ఒక రోజు అవకాశం ఉంటుంది. ఇందుకు రూ.10 వేలు చెల్లించాలి. నలుగురికి అన్నదానం చేయదలిస్తే రూ.1,116 చెల్లించాలి. శాశ్వత పట్టాభిషేకం చేయించదలిస్తే ఏడాదిలో ఒకసారి పుష్యమి నక్షత్రం రోజున ఈ అవకాశం వర్తిస్తుంది. ఇందుకు రూ.2,500 చెల్లించాలి. శాశ్వత వాహన సేవకు రూ.10 వేలు చెల్లించాలి.

అంతర్జాతీయ నృత్య పోటీల్లో ప్రతిభ

పాల్వంచ సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీలంక దేశం కొలంబోలో జరిగిన అంతర్జాతీయ నృత్య పోటీల్లో పాల్వంచ కళాకారులు ప్రతిభ కనబరిచారు. ఆదివారం కొలంబోలో రీకాన్ ఇంటర్నేషనల్, తెలంగాణ టూరిజం తదితరాల ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ నృత్య పోటీల్లో పాల్వంచ పట్టణ పరిధిలోని సంజయ్‌నగర్ కాలనీకి చెందిన వెన్నెల, జ్ఞాపికలు జానపద పోటీల్లో తృతీయ బహుమతి సాధించారు. వీరు వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, రీకాన్ ఇంటర్నేషనల్ నిర్వాహకులు కలువ చంద్రశేఖర్ చేతుల మీదుగా బహుమతి తీసుకున్నారు. పాల్వంచ సంజయ్‌నగర్ కాలనీకి చెందిన సిద్దెల హుస్సేన్‌కు జానపద నృత్య పోటీల్లో ప్రథమ బహుమతి కైవశం చేసుకున్నారు.



పురస్కారం అందుకుంటున్న జ్ఞాపిక


అదే విషాదం

(మొదటిపేజీ తరువాయి)శస్త్రచికిత్సలు నిర్వహించిన ఈమె సమీప ప్రాంత వాసులకు చిరపరిచితురాలు. రెండేళ్ల క్రితం ఆగస్టు నెలలో ఈమె తమ్ముడు శ్రీహరి బైక్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. ఇప్పుడు ఇదే నెలలో జరిగిన ప్రమాదంలో భర్త, తల్లిని ఆమె కోల్పోయారు. కొంతకాలం క్రితం ప్రమాదంలో చనిపోయిన తన తమ్ముడి కుమార్తె సాయివైష్ణవి వివాహాన్ని జరిపించి, 14న సాయంత్రం జడ్చర్లలో రిసెప్షన్‌కు హాజరయ్యేందుకు భర్త, తల్లి, తనతో పాటే ఉండే శోభతో కలసి ఝాన్సీలక్ష్మి కారులో బయల్దేరారు. కారు డ్రైవర్ రాకపోవడంతో డా.విజయ్‌కుమార్ వాహనాన్ని నడిపినట్లు సన్నిహితులు పేర్కొంటున్నారు. ట్యాంకర్ డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. కొత్తగూడెం సింగరేణి ప్రధానాసుపత్రిలో ప్రసూతి వైద్యురాలిగా పనిచేసిన ఝాన్సీలక్ష్మి తన ఏకైక కుమారుని పేరిట ప్రసూతి ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. సోమవారం ఆమెకు ప్రమాదం జరిగిందని తెలియడంతో ఆస్పత్రి వద్దకు పెద్ద సంఖ్యలో స్థానికులు చేరుకున్నారు. గూడెంలోని పలువురు వైద్యులు ఆమెకు అందుతున్న చిక్సిత విషయమై ఆరాదీశారు. ఝాన్సీలక్ష్మి ఆరోగ్య పరిస్థితిపై హైదరాబాద్ ఎల్బీనగర్ కామినేని ఆస్పత్రి న్యూరోసర్జన్ డా.జలీల్‌తో మాట్లాడగా, ప్రమాదంలో మిడ్ బ్రెయిన్‌లో గాయాలు అయ్యాయని, వెంటిలేటర్‌పై ఉంచామన్నారు. ప్రస్తుతం అబ్జర్వేషన్‌లో ఉన్నారని, ఆపరేషన్ చేసిన తరువాత స్పష్టత వస్తుందని తెలిపారు. ప్రమాదంలో మృతిచెందిన డా.విజయ్‌కుమార్‌కు ఫిజిషియన్‌గా మంచి పేరుంది. నర్సంపేట శాసనసభ్యుడిగా 5సార్లు సేవలందించడమే కాక మద్దికాయల ఓంకార్ కుమారుడు కావడం గమనార్హం. నెల రోజుల క్రితమే ఒప్పంద ప్రాతిపదికన కొత్తగూడెం వైద్యశాలలో సేవలందిస్తున్నారు. సౌమ్యంగా వ్యవహరించే వైద్యుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంపై స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కుటుంబంలో వేడుకలు జరిగి మూడు రోజులు కూడా గడవకముందే రోడ్డు ప్రమాదం రూపంలో ఆ కుటుంబంలో ఇద్దరు మృతి చెందటంపై స్థానికంగా విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రమాద వార్త తెలియగానే పట్టణ వైద్యులు, స్థానికులు పెద్ద సంఖ్యలో గూడెంలోని ఆమె నివాసం వద్దకు చేరుకున్నారు.

కొత్తగూడెం శాసనసభ్యుడు జలగం వెంకటరావు బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర నాయకుడు కూనంనేని సాంబశివరావు, నాయకులు సాబీర్‌పాషా సానుభూతిని వ్యక్తం చేశారు.



సంఘటన స్థలం దృశ్యం



విజయ్‌కుమార్ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న నోముల నర్సింహయ్య

నలుగురు ఉద్యోగులకు రాష్ట్ర స్థాయి అవార్డులు

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: భద్రాది కొత్తగూడెం జిల్లాకు చెందిన నలుగురు ఉద్యోగులకు రాష్ట్ర స్థాయి అవార్డులు దక్కాయి. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం వ్యక్తిగతంగా ఆన్‌లైన్ ద్వారా ప్రతిభావంతులైన ఉద్యోగులను ప్రోత్సాహక(ఇన్సెంటివ్) అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆహ్వానించింది. ఇందులో జిల్లాకు చెందిన నలుగురు ఉద్యోగులకు ఈ అవార్డులు దక్కాయి. గ్రూప్-1 విభాగంలో డాక్టర్ వి.వేణుగోపాల్‌రావు(జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి), గ్రూప్-2 విభాగంలో ఐటీడీఏలో గణాంక అధికారి హెచ్.డేవిడ్‌రాజు (సాంఘిక సంక్షేమశాఖ), గ్రూప్-3 విభాగంలో పాల్వంచ పురపాలకంలోని సీనియర్ అసిస్టెంట్ షేక్.అంకుషావళి, గ్రూప్-4 విభాగంలో అటవీశాఖ పాల్వంచ బీట్ ఆఫీసర్ ఇస్లావత్ రమేశ్‌లు అవార్డులకు ఎంపికయ్యారు.

పెద్దాసుపత్రిలో నిఘా నేత్రాలు

(మొదటిపేజీ తరువాయి) ఫోన్‌ను అందుబాటులో ఉంచారు. ఇక్కడ చికిత్సలు పొందుతున్న వారి వివరాలను తెలుసుకునేందుకు ఈ నంబరకు సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు. కాన్పుల వార్డులో కూడా ఒక ఫోన్‌ను ఏర్పాటు చేసినప్పటికీ దీన్ని చికిత్సల సమాచార సేకరణకు ఉపయోగిస్తున్నారు. త్వరలోనే కంట్రోల్ రూమ్ ద్వారా ఇంటర్ కమ్ విధానం పాటించేందుకు ప్రయత్నిస్తున్నామని సూపరింటెండెంట్ డా.కోటిరెడ్డి తెలిపారు. అన్ని వార్డుల్లో ఫోన్లను అందుబాటులో ఉంచి అత్యవసర సేవల నిమిత్తం ఇంటర్ కమ్ విధానాన్ని ఉపయోగించే వీలుందన్నారు. ఔట్ గోయింగ్ సదుపాయం లేకుండా ఆసుపత్రుల వార్డుల వరకే దీన్ని ఉపయోగించనున్నారు.

తెల్లబోతున్న కొత్త ఆసుపత్రి

భద్రాచలంలో రూ.18.14 కోట్లతో 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను కార్పొరేట్‌కు దీటుగా చేపట్టి గత నెల 24న మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, లక్ష్మారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించినప్పటికీ ఇది అలంకార ప్రాయంగా మారింది. క్యాడర్ స్ట్రెంత్ నిర్ణయం జరగకపోవడంతో ఇక్కడకు కొత్తగా ఎంతమంది వైద్యులను, ఎందరు సిబ్బందిని పంపించాలో వైద్య ఆరోగ్యశాఖకు స్పష్టత కరవైంది. ఇప్పటికిప్పుడు రెగ్యులర్ పోస్టులను భర్తీ చేయాలంటే కుదిరే పనికాదు. ఇప్పటికే ఉన్న 100 పడకల ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది కొరత ఉంది. ఈ పరిస్థితుల్లో నూతనంగా ప్రారంభించిన ఆసుపత్రిని స్వాధీనం చేసుకుంటే లేనిపోని చిక్కులు వస్తాయని ఆసుపత్రి నిర్వాహకులు వెనుకంజ వేస్తున్నారు. 100 పడకల ఆసుపత్రిలో చక్కని పారిశుద్ధ్య చర్యలు చేపట్టి కాయకల్ప పథకంలో ఎంపికవ్వగా ఇప్పుడు మరో 100 పడకల నిర్వాహణ సవాల్‌గా మారింది. వైద్యుల పోస్టుల భర్తీలో జాప్యం లేకుండా చూడాల్సి ఉంది. 10 పడకలతో ఐసీయూని ప్రారంభించారు. ఇందుకు రూ.32 లక్షలు వెచ్చించారు. ఇదీ అందుబాటులోకి రాలేదు. పాత ఆసుపత్రిలోనే అత్యవసర సేవలు అందిస్తున్నారు. ఇందులో పనిచేసే వైద్యులు ప్రయివేటు ప్రాక్టీస్‌కన్నా దీనిపై ఎక్కువ దృష్టి సారించేలా చర్యలు తీసుకుంటే రోగులకు మేలు జరుగుతుందని పలువురు అంటున్నారు.

తాత్కాలిక పోస్టుల్లో మాయలుంటాయి జాగ్రత్త

తాత్కాలిక పోస్టులతోనే వైద్య సేవలను అందించాల్సిన పరిస్థితి ఇక్కడ ఉంది. దీన్ని ఆసరాగా చేసుకుని ఇప్పటికే కొంతమంది చక్రం తిప్పేందుకు రకరకాల ప్రయత్నాలు సాగిస్తున్నారు. వైద్యులతో పాటు స్వీపర్ వరకు అన్ని విధాలుగా సుమారు 50 మందిని నియమించాల్సి వస్తుందని అంచనా. గతంలో ఇక్కడ జరిగిన తాత్కాలిక పోస్టుల్లో మాయ జరిగింది. కొన్ని పోస్టుల్లో తమకు నచ్చిన వారికి ఉద్యోగాలను కట్టబెట్టారు. కొత్తగూడెం కేంద్రంగా ఒకరిద్దరు చక్రం తిప్పగా ఇక్కడ కూడా ఒకరిద్దరు వారికి సహకరించారు. ఓ నర్సింగ్ ఉద్యోగి సైతం అందరితో కాకుండా చాలా రోజుల తర్వాత ఇక్కడ చేరారు. వేరే జిల్లాకు చెందిన ఇద్దరు వ్యక్తులు కొలువు దక్కించుకున్నారు. ఇందులో ఎవరి పాత్ర ఎంతనేది విచారణలో తేలాల్సి ఉన్నా జిల్లా అధికారులకు అంత తీరకలేనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ సారైనా పారదర్శకత పాటించి అర్హులైన వారికి అవకాశం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

వైభవంగా సీతారామ కల్యాణోత్సవం



భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం రామాలయంలో సోమవారం స్వామి వారు ముత్తంగి రూపంలో దర్శనమిచ్చారు. ముత్యాలతో పొదిగిన వస్త్రాలంకృతులైన సీతారాముల వారు చూడముచ్చటగా దర్శనమివ్వడంతో భక్తులు పులకించారు. 'జై శ్రీరామ్' అంటూ నీరాజనాలు పలికారు. ప్రధాన ఆలయంలో మూలమూర్తులకు అర్చకులు భక్తిశ్రద్ధలతో సుప్రభాతం పలికి ఆరాధన జరిపి నామార్చనలు చేశారు. వైదిక పెద్దలు క్షేత్ర విశిష్టతను ప్రవచనం చేయడంతో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. వైష్ణవ సంప్రదాయంలో ప్రత్యేక పూజలు జరిపి నిత్య కల్యాణ ఘట్టం గురించి వివరిస్తుండగా ప్రధానార్చకులు సీతారామానుజాచార్యులు ఈ క్రతువును కమనీయంగా జరిపారు. మాంగళ్యధారణ కనులకు పండుగ చేయగా దర్బారు సేవ మంత్రముగ్ధులను చేసింది. విశేష సంఖ్యలో వచ్చిన భక్తులు కానుకలను సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఖమ్మం నగరానికి చెందిన ప్రసాద్ అనే భక్తుడు కుటుంబ సభ్యులతో వచ్చి ఆలయ దర్శనం చేసుకొని రూ. 21,300 విలువైన వెండి బిందెను ఈవో ప్రభాకర శ్రీనివాస్, ఏఈవో శ్రావణ్‌కుమార్ చేతుల మీదుగా స్వామి వారికి సమర్పించారు. జిల్లా ఎస్పీ అంబర్ కిశోర్‌ఝా, ఏఎస్పీ సునీల్‌దత్, సీఐ బి.శ్రీనివాసులు, ఎస్సై కరుణాకర్ ఆలయాన్ని దర్శించుకున్నారు. వీరికి అధికారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. అర్చకులు ఆశీర్వచనం అందించారు. చిత్రకూట మండపంలో శ్రీమద్భాగవత సప్తాహం ఘనంగా జరిగింది. మంత్రోచ్చారణలతో ఈ ప్రాంతం అలరారింది. ఈ నెల 18న జరిగే శ్రావణ శుక్రవారం పూజల్లో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొనాలని ప్రధానార్చకులు జగన్నాథాచార్యులు కోరారు.



వెండి బిందెను అందిస్తున్న ఖమ్మం నగరానికి చెందిన ప్రసాద్



ఆలయాన్ని దర్శించుకున్న ఎస్పీ కిశోర్‌ఝా, ఏఎస్పీ సునీల్‌దత్

దోబూచులాడుతున్న గోదారి



భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం వద్ద గోదావరి స్వల్పంగా పెరిగి మళ్లీ తగ్గుతుంది. ఎగువ ప్రాంతంలో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఈ పరిస్థితి తలెత్తింది. రెండ్రోజుల క్రితం 17 అడుగుల మేర ఉండగా సోమవారానికి దాదాపు 20 అడుగులకు చేరింది. ఆ తర్వాత నిదానించి తగ్గుముఖం పట్టింది. సాయంత్రం 4 గంటలకు 19.6 అడుగులు ఉన్నట్లు సీడబ్ల్యూసీ యంత్రాంగం తెలిపింది. ఇంకా తగ్గే వీలుందని భావిస్తున్నారు. ప్రస్తుతానికి ఎలాంటి ప్రమాదం లేనప్పటికీ ఆగస్టులో అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే క్షేత్రస్థాయి సిబ్బందికి జిల్లా అధికారులు దిశానిర్దేశం చేశారు.

ఖమ్మం సమగ్రాభివృద్ధికి ప్రత్యేక కృషి

ఐటీహబ్ నిర్మాణ పనుల ప్రారంభ సభలో ఎమ్మెల్యే అజయకుమార్

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: ఖమ్మం నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికతో కృషి చేస్తున్నట్లు ఖమ్మం శాసన సభ్యుడు పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. సోమవారం నగరంలోని ఇల్లెందు క్రాస్‌రోడ్డులో నిర్మించనున్న ఐటీ హబ్ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కొన్ని పనులు ప్రారంభించాలంటే ప్రభుత్వ పరంగా ప్రత్యేక అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందని, అందువల్ల ఆయా పనుల్లో జాప్యం జరిగితే కొంతమంది ప్రతిపక్ష నాయకులు వాటిపై తప్పుడు ప్రచారం చేయడం సహేతుకం కాదన్నారు. అంచనాలు రూపొందించడం, దానికనుగుణంగా నిర్మాణ ప్రణాళిక రూపొందించి సుదీర్ఘంగా చర్చించిన అనంతరమే నిర్మాణ అనుమతులు వస్తాయన్న విషయాన్ని విపక్షాలు గ్రహించాలని సూచించారు. నగరంలోని నిర్మించనున్న బస్టాండ్, గొల్లపాడు ఛానల్ ఆధునికీకరణ పనులన్నింటిని చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఇందుకు లకారం చెరువు, రోడ్ల విస్తరణే నిదర్శమన్నారు. ఇప్పటికే వ్యవసాయ రంగానికి పునర్వైభవం తెచ్చేందుకు ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టిందని తెలిపారు. మిషన్ కాకతీయ, రైతు సమాఖ్యల ఏర్పాటు, క్రాప్‌కాలనీల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఖమ్మం నగర సమగ్ర అభివృద్ధి విషయంలో వెనుకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గడిపెల్లి కవిత మాట్లాడుతూ.. ఖమ్మం నగరపాలక సంస్థగా మారిన నాటి నుంచి అభివృద్ధి పనులు వేగవంతంగా అమలు చేస్తున్నారని, నగరాన్ని మరింత అభివృద్ధికి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. శాసన మండలి సభ్యులు బాలసాని లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే అజయ్‌కుమార్ చొరవతో నగరం ఎంతో అభివృద్ధి చెందిందని, ఇతర జిల్లాల వారు సైతం ఖమ్మం నగరాన్ని చూసి వారి జిల్లాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించడం దీనికి నిదర్శనమన్నారు. మేయర్ పాపాలాల్, ఉపమేయర్ మురళీప్రసాద్, కార్పొరేటర్లు సీహెచ్.నారాయణరావు, కె.నీరజ, కె.కృష్ణ, షౌకత్ అలీ తదితరులు ప్రసంగించారు. దీనికి ముందు టీఎస్ఐడీసీ జోనల్ మేనేజర్ పవన్‌కుమార్ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు, తెరాస అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. దీనికి ముందు తెరాస, యువజన విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నగరంలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అజయ్. వేదికపై బాలసాని, కవిత, కృష్ణ తదితరులు

భద్రాచలం

21 నుంచి ఐటీడీఏ ఎదుట దీక్షలు: జీఎస్పీ

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: ఆదివాసీల స్వయం పాలన హరించే జీవో 54ను తక్షణమే రద్దు చేయాలని, ఈ నెల 21 నుంచి భద్రాచలం ఐటీడీఏ ఎదుట మరోసారి దీక్షలు చేపట్టనున్నట్లు జీఎస్పీ రాష్ట్ర కన్వీనర్ సోందె వీరయ్య తెలిపారు. సోమవారం పట్టణంలో జీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు సోడి చలపతి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం జీవో 54ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ భద్రాచలం నుంచి ఆదిలాబాద్ వరకు కొనసాగే స్వయంపాలన దండయాత్ర కరపత్రాలను విడుదల చేసినట్లు తెలిపారు. సమావేశంలో పూనెం రమణబాబు, గడ్డం వెంకన్నబాబు, గొగ్గెల రాజేశ్, నవీన్, చందు, శివ, మహేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీఎస్పీ రాష్ట్ర కన్వీనర్ వీరయ్య

ఐటీసీ పీఎస్‌పీడీ ఆధ్వర్యంలో వృద్ధులకు వితరణ

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: అనాథలకు సాయం అందించడంలో ఐటీసీ పీఎస్‌పీడీ భద్రాచలం మహిళా సమితి అనేక కార్యక్రమాలు చేపడుతుందని సంస్థ భద్రాచలం మహిళా సమితి అధ్యక్షురాలు ఆశా అన్నారు. భద్రాచలంలోని రామాలయం సమీపంలోని హరే రామ నామ సంకీర్తన చేసే వృద్ధులకు సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పరుపులు, దుప్పట్లు, దోమతెరలు, దీపారాధనకు నూనె డబ్బాలు వితరణగా అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆశా మాట్లాడుతూ.. కృష్ణాష్టమి సందర్భంగా ఈ వృద్ధులకు సుమారు 20 వేల విలువైన వస్తువులను అందించామని తెలిపారు. అనంతరం అక్కడి విగ్రహాలకు పూజలు చేసి భజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షురాలు అశ్విని, కార్యదర్శి ప్రీతి, సంయుక్త కార్యదర్శి సునీత, మణి, సలహాదారు శైలజ తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులకు వితరణ అందిస్తున్న మహిళా సమితి సభ్యులు

తెరపై ఈనాడు

ఏషియన్ ఉదయభాస్కర్: ఫిదా
విజయభాస్కర్: నేనే రాజు నేనే మంత్రి
గోపాలకృష్ణ: జయ జానకి నాయక

కూరగాయల ధరలు(కిలో రూ.ల్లో)

భద్రాచలం: ఉల్లిపాయలు 15, టమాట 60, అల్లం 60, బెండకాయలు 40, దొండకాయలు 30, పచ్చి మిరప 80, బంగాళదుంపలు 20, వంకాయలు 40, క్యారెట్ 80, క్యాబేజీ 30, మునగకాయ మూడు 10, చింతపండు 100, చేమదుంపలు 40, ఆనప 15, కాకర 40

శ్రావణ మంగళవారం కోసం ఏర్పాట్లు

★ ముస్తాబవుతున్న శ్రీముత్యాలమ్మ తల్లి ఆలయం

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: శ్రావణ మాసం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు మండల కేంద్రం దుమ్ముగూడెంలోని శ్రీముత్యాలమ్మ ఆలయంలో ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తుంది. ప్రతీ ఏడాది శ్రావణ మాసం చివరి మంగళవారం గ్రామదేవత శ్రీముత్యాలమ్మ తల్లికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అమ్మ వారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులతో పాటు మహిళలు వస్తుంటారు. ఆలయానికి వచ్చిన మహిళలకు పసుపు, కుంకుమ, గాజులు, జాకెట్లు ప్రతీ ఏడాది ఆలయ కమిటీ పంపిణీ చేస్తుంది. ఇందుకోసం నిర్వాహకులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. వచ్చిపోయే భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేయడంతో పాటు ఉచిత అన్నదానం నిర్వహిస్తారు. వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు క్షేత్రస్థాయిలో ఉంటూ పర్యవేక్షిస్తున్నారు. ఇదిలా ఉండగా ఇటీవల ఆలయ కమిటీ ఛైర్మన్ పదవి కోసం అనేక మంది పోటీపడ్డారు. ఇరువర్గాల మధ్య తీవ్రస్థాయిలో వివాదాలు చోటు చేసుకున్నాయి. దీంతో ఆలయ పెద్దలు రెండు వర్గాలను సమన్వయం చేయడానికి కొంత సమయం తీసుకొని శాంతపర్చారు. ప్రస్తుతం మజ్జి త్రినాథరెడ్డి ఆలయ కమిటీ ఛైర్మన్‌గా కొనసాగుతూ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఆలయానికి సంబంధించిన 19 జాతర ఆదాయ, వ్యయాలపై కొద్ది రోజుల నుంచి రెండు వర్గాల మధ్య తీవ్ర వివాదం కొనసాగుతుంది. ఎట్టకేలకు ఆలయ పెద్దలు జోక్యం చేసుకొని జాతరకు సంబంధించిన వివరాలు పుస్తకాలు, రసీదులను స్వాధీనం చేసుకొని ఆదాయ వ్యయాలను తనిఖీ చేస్తున్నారు. కనీసం శ్రావణ మంగళవారం కార్యక్రమం పూర్తయిన తర్వాత ఆదాయ, వ్యయాలపై జరుగుతున్న వివాదాన్ని పరిష్కరించి నూతన ఆలయ కమిటీ ఛైర్మన్, సభ్యులను నియమించాలని భక్తులు కోరుతున్నారు. గత మూడు నెలలుగా శ్రీముత్యాలమ్మ ఆలయంలో రెండు వర్గాల మధ్య జరుగుతున్న వివాదాలు, పరిణామాలు కారణంగా ఆదాయ, వ్యయాలపై జవాబుదారీతనం లోపించిందనే విమర్శలు గుప్పుమంటున్నాయి. ఇకనైనా ఆలయ పెద్దలు స్పందించి శ్రీముత్యాలమ్మ నూతన ఆలయ కమిటీ ఛైర్మన్, సభ్యుల ఎన్నికను జరపాలని, శ్రావణ మంగళవారం పూజా కార్యక్రమాలు ఎలాంటి అవరోధాలు లేకుండా నిర్వహించాలని భక్తులు కోరుతున్నారు.



శ్రీ ముత్యాలమ్మ తల్లి ఆలయం

రహదారి ప్రమాదంపై కేసు నమోదు

వెంకటాపురం, న్యూస్‌టుడే: మండలంలోని వెంకటాపురం-ఎడ్జర్లపల్లి రహదారిపై ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటనపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. వాడగూడేనికి చెందిన కొడారి అంజనేయులు మృతదేహాన్ని స్థానిక సివిల్ ఆసుపత్రిలో ఎస్సై బండారి కుమార్ పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను ఆరా తీశారు. కాలినడకన స్వగ్రామం నుంచి వెంకటాపురం వస్తుండగా రాత్రి లక్ష్మీనగరం వైపు నుంచి వచ్చిన ద్విచక్రవాహనదారుడు ఢీకొనడంతో అక్కడికక్కడ మృతి చెందినట్లు వివరించారు. ఘటనా ప్రాంతాన్ని సైతం పోలీసులు పరిశీలించారు. శవపంచనామా అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆసుపత్రి వద్ద కుటుంబ సభ్యులను తెరాస నాయకుడు బాలసాని ముత్తయ్య పరామర్శించారు. దహన సంస్కారాల నిమిత్తం ఎస్సై కుమార్, ముత్తయ్య, సంతోష్‌కుమార్ రూ.5 వేల ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆసుపత్రి వద్దకు పెద్ద ఎత్తున స్థానికులు తరలివచ్చారు.



ఘటన వివరాలు ఆరా తీస్తున్న ఎస్సై బండారి కుమార్

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు

వాజేడు, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య దినోత్సవానికి మండలంలోని పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలన్నీ ముస్తాబవుతున్నాయి. మండల కేంద్రంలోని పాఠశాలల్లో విద్యార్థులు రంగుల కాగితాలను అంటించడంలో నిమగ్నమయ్యారు. విద్యార్థులు తమ తరగతి గదులను ముస్తాబు చేస్తున్నారు. వరుసగా రెండు రోజుల పాటు సెలవులు రావడంతో పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా తయారు చేసుకుంటున్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జెండా దిమ్మెకు కార్యాలయ సిబ్బంది రంగులు వేస్తున్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి.



ఎంపీడీవో కార్యాలయంలో దిమ్మెకు రంగులు వేస్తున్న సిబ్బంది

ఘనంగా విశ్వహిందూ పరిషత్ స్థాపన దినోత్సవం

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: దేశంలోని హిందువులంతా ఏకమై హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలని, విదేశీ మతాలను ప్రోత్సహించవద్దని భద్రాచలం విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు కోమటి నాగేశ్వరరావు అన్నారు. విశ్వహిందూ పరిషత్ స్థాపన దినోత్సవం సందర్భంగా సోమవారం పట్టణంలోని కృష్ణాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పరిషత్ స్థాపించి 53 ఏళ్ల పూర్తయినందున శ్రీ కృష్ణ జన్మదినం వేడుకలను నిర్వహించినట్లు తెలిపారు. రానురాను హిందువులు మతమార్పిడిలకు గురవుతున్నారు. అందరూ ఐక్యమై హిందుత్వాన్ని కాపాడాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రామాయణ శర్మ, కార్యదర్శి గడిదేశి వెంకటేశ్వర్లు, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

నీటి వృథాకు అడ్డుకట్ట • అపర సంజీవని వచ్చేసిందోచ్

మండల కేంద్రంలోని రక్షిత మంచినీటి పథకానికి తాగునీటిని సరఫరా చేసే ప్రధాన మోటారు వద్ద నీరు వృథాగా పోతున్న వ్యవహారంపై పంచాయతీ అధికారులు మేల్కొన్నారు. సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన 'వృథా.. వ్యథ' అనే శీర్షికకు స్పందించారు. కృష్ణాష్టమి సెలవు దినమయినా స్వగ్రామానికి వెళ్లిన ఈవో వీరాస్వామి తక్షణ మరమ్మతులకు చర్యలు తీసుకున్నారు. మరమ్మతులకు గురైన నల్లా స్థానంలో నూతన నల్లాను అమర్చాలని చరవాణిలో పంచాయతీ కార్మికులకు సూచించారు. దీంతో వారు నల్లాను బిగించారు. తాగునీటి సంరక్షణకు అధికారులు తీసుకున్న చొరవ పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– వెంకటాపురం, న్యూస్‌టుడే



ఈనాడు కథనానికి స్పందన

ఎట్టకేలకు అపర సంజీవని సేవలు పునరుద్ధరణకు నోచుకున్నాయి. పక్షం రోజులుగా మరమ్మతులతో 108 వాహనం అభాగ్యులకు దూరమైన విషయాన్ని వివరిస్తూ ఈ నెల 11న 'ఈనాడు'లో 'అపర సంజీవనికి అనారోగ్యం' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి వైద్య ఆరోగ్య శాఖ, వాహన నిర్వాహణ సంస్థ అధికారులు స్పందించారు. వాజేడు, వెంకటాపురం మండలాల పరిధిలోని నాలుగు ఆసుపత్రుల్లో సేవలందిస్తున్న ఈ వాహనం టైర్ల మరమ్మతుల కారణంగా నిలిచిన విషయంపై జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి అప్పయ్య స్థానిక వైద్యులను ఆరా తీసినట్లు తెలిసింది. ఈ మేరకు 108 వాహన నిర్వాహణ ఏజెన్సీతో సైతం చర్చించి ప్రస్తుతం వ్యాధుల సీజన్ కావడంతో అత్యవసరంగా పునరుద్ధరణ జరిగేలా చూడాలని సూచించినట్లు సమాచారం. ఇదే క్రమంలో ఏజెన్సీలోని పలు మండలాల్లో వాహనాలు మరమ్మతులతో ఆగిపోవడంతో అప్పటికప్పుడు టైర్లను తెప్పించి వాహనాన్ని సేవల్లోకి తీసుకొచ్చినట్లు తెలిసింది.

– వెంకటాపురం, న్యూస్‌టుడే



భద్రాచలం

నేడు వెంకటాపురంలో ఉచిత వైద్యశిబిరం

వెంకటాపురం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని సెంటినరీ మెథడిస్ట్ ప్రార్థనా మందిరం ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు సంఘ కాపరి బి.విజయ్‌చందర్ సోమవారం తెలిపారు. ఇక్కడి పాతమార్కెట్ వద్ద ఉన్న ప్రార్థనా మందిరంలో శిబిరం నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ వైద్యులు శిబిరంలో రోగులను పరీక్షిస్తారన్నారు. రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేయనున్నట్లు వివరించారు. మండల ప్రజలు ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

17 నుంచి తట్టు, రుబెల్లా టీకాలు పంపిణీ

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: 9 నెలల నుంచి 15 సంవత్సరాల వరకు వయస్సున్న ప్రతీ ఒక్కరికి తట్టు, రుబెల్లాకు సంబంధించిన టీకాలను వేయించాలని భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షణాధికారి డాక్టర్ కోటిరెడ్డి సూచించారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన సమావేశంలో కోటిరెడ్డి మాట్లాడుతూ.. తట్టు, రుబెల్లా వంటి ప్రాణాంతక వ్యాధులను నివారించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన టీకాల కార్యక్రమంలో డివిజన్లలోని పిల్లలందరికీ టీకాలు వేయడానికి వారి తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ఈ నెల 17 నుంచి సెప్టెంబరు 9 వరకు అన్ని పాఠశాలలు, ఆసుపత్రులలో ఈ టీకాలు వేయడానికి ప్రణాళిక సిద్ధం చేయడం జరిగిందన్నారు. సెప్టెంబరు 10 నుంచి 25 వరకు పాఠశాలలకు వెళ్లని పిల్లలను గుర్తించి ఇంటింటికి తిరిగి టీకాలు వేయనున్నట్లు తెలిపారు. అనంతరం టీకాల ప్రచారంపై రూపొందించిన గోడ పత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో పట్టణ ప్రైవేటు వైద్యులు రాజశేఖర్, రవికుమార్, సుదర్శన్, జయభారతి, పవన్‌కుమార్, నవీన్, సీతారామరాజు పాల్గొన్నారు.



గోడ పత్రాలు విడుదల చేస్తున్న వైద్యులు

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



భద్రాచలం పట్టణం: కృష్ణాలయంలో భక్తుల పూజలు



చర్ల: సూపర్‌బజార్ సెంటర్లో ఉట్టికొట్టే ఉత్సవం

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని సీతారాముల కళ్యాణ మండపం రోడ్డులోని శ్రీకృష్ణాలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు పెద్ద ఎత్తున ఆలయం వద్దకు చేరుకొని పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణుని వేషధారణలో ఆలయానికి వచ్చిన బాలలతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. అనంతరం అర్చకులు భక్తులకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందించారు.

చర్ల, న్యూస్‌టుడే: మండలంలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. గొల్లకట్ట యాదవ సంఘం ఆధ్వర్యంలో సూపర్‌బజార్ వద్ద ఉట్టి కొట్టే ఉత్సవం ఉత్సాహంగా సాగింది. తొలుత స్వామివారిని ఊరేగించి ముత్యాలమ్మ ఆలయం వద్ద ఉట్టి కొట్టే ఉత్సవాన్ని నిర్వహించారు. గొంపెన గూడెంలో ఎంపీపీ కోదండ రామయ్య వేడుకలను ప్రారంభించారు. అనంతరం స్వామి వారిని పురవీధుల్లో ఊరేగించారు. కుదునూరులోని వేణుగోపాలస్వామి ఆలయంలో, అంజనాపురంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఆలయాల్లో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు జరిగాయి.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలంలోని శివారు కాలనీల్లో రోడ్డు లేని చోట నూతన రోడ్లు నిర్మించేందుకు కార్యాచరణ చేపట్టినట్లు భద్రాచలం సర్పంచి భూక్యా శ్వేత తెలిపారు. సోమవారం శాంతినగర్ కాలనీలోని శాంతిగణపతి ఆలయం వద్ద నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. పట్టణంలోని కాలనీల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు సర్పంచి తెలిపారు. కాలనీలలో ఏ సమస్యలున్నా తమకు తెలపాలని ఈ సందర్భంగా ఆమె కోరారు.



సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న సర్పంచి శ్వేత

ప్రభుత్వ కళాశాలలను ఏర్పాటు చేయాలి

వెంకటాపురం, న్యూస్‌టుడే: మన్యం ప్రాంతమైన వెంకటాపురం మండలంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలని జీఎస్పీ మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి పూనెం సాయి డిమాండ్ చేశారు. మహితాపురంలో సోమవారం ఆదివాసీ యువకులు, విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఏజెన్సీలో నిరుపేద గిరిజనులు, గిరిజనేతరులు ఉంటే ఇక్కడ ప్రైవేటు కళాశాలలను నిర్వహిస్తున్న ప్రభుత్వం పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వ ఉన్నత విద్యను ఎందుకు అందుబాటులోకి తేవడం లేదని ప్రశ్నించారు. దీంతో ఆర్థిక స్తోమత అంతంత మాత్రంగానే ఉన్న పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం కావాల్సి వస్తోందన్నారు. జూనియర్, డిగ్రీ కళాశాలల ఏర్పాటును కోరుతూ జీఎస్పీ తలపెట్టిన ఆందోళనలకు విద్యార్థులు సన్నద్ధం కావాలని కోరారు. సమావేశంలో ప్రశాంత్, ప్రవీణ్, శేఖర్, రమేశ్, మోహన్, సూర్యం పాల్గొన్నారు.

చర్ల, న్యూస్‌టుడే: కలియుగ ప్రత్యక్షదైవం శ్రీనివాసుని కల్యాణం సోమవారం రాత్రి మన్యం ప్రాంతమైన చర్లలో కనుల పండువగా సాగింది. తిరుమల నుంచి వచ్చిన వేద పండితుల నేతృత్వంలో సాగిన కల్యాణాన్ని ఆద్యంతం భక్త జనం వీక్షించి పరవశులయ్యారు. ఓ పక్క అన్నమాచార్య కీర్తనలు.. మరోపక్క వెంకటాచల మహత్యాన్ని వివరిస్తూ హరికథ రూపంలో కళాకారులు స్వామి వారి మహత్యాన్ని కళ్లకు గట్టారు. స్థానిక ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జగత్తుకు

వైభవంగా శ్రీనివాసుని కల్యాణం

ఆనందాన్ని కల్గించే లోక కళ్యాణుడైన వేంకటేశ్వరుడి పెళ్లికి ఊరంతా పచ్చని తోరణాలు కట్టడంతో పర్ణశాల వన్నె వచ్చింది. వేదమంత్రాలు, మంగళవాయిద్యాలతో అర్చకులు స్వామివారి కల్యాణంను శాస్త్రోక్తంగా నిర్వహించారు. రెండు గంటల పాటు సాగిన క్రతువు ఆధ్యాత్మిక తేజస్సును నింపింది. కల్యాణ సమయంలో 'శ్రీనివాస గోవిందా..శ్రీవెంకటేశా గోవిందా' నామస్మరణలతో భక్తులు స్వామివారికి నీరాజనాలు పలికారు. ఉదయం నుంచి ఉత్సవ కమిటీ సభ్యులు నల్లపు దుర్గాప్రసాద్, జవ్వాది రవికుమార్, ఎడారి భూపతి, కొవ్వూరి రమణ, చింతా నాగబాబు, గుంజి పురుషోత్తం, పెండుర్తి ఆంజనేయులు, పువ్వుం రామకృష్ణ, మచ్చా వీర్రాజు, పంపన రాములు నేతృత్వంలో భక్తులకు ఎలాంటి అవరోధాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు. తితిదే ఆలయ అర్చకులు బాలజీ నేతృత్వంలోని అర్చక స్వాముల బృందం కల్యాణ క్రతువును నిర్వహించారు. కళ్యాణోత్సవం సందర్భంగా దీక్షా ఫలం, అర్ధఫలం, పురుషార్థఫలం పొంది మోక్షాన్ని పొందు



చర్లలో సోమవారం రాత్రి కనులపండువగా సాగిన శ్రీనివాసుని కల్యాణం



స్వామివారి శోభాయాత్రలో కోలాట ప్రదర్శన

తారని అర్చకస్వాములు మంత్రోచ్ఛరణలతో వివరించారు. భద్రాచలం ఆలయ అర్చకులు రామ స్వరూప్, తితిదే అధికారులు కల్యాణంలో పాల్గొన్నారు.

ఘనంగా 'శోభ యాత్ర'

తిరుమల నుంచి వచ్చిన స్వామి వారి రథంకు స్థానికులు ఆయిల్‌బంకు ఏరియాలో ఘనస్వాగతం పలికారు. అక్కడ నుంచి మేళతాళాలతో స్వామి వారి శోభాయాత్ర సాగింది. ఎర్రంపాడు, చెన్నాపురం దండకారణ్యానికి చెందిన ఆదివాసీలు చందు నేతృత్వంలో స్వామివారిని కొమ్ము నృత్యాలు చేస్తూ స్వాగతం పలికారు. భద్రాచలం నుంచి వచ్చిన కోలాట బృందాల ఆధ్వర్యంలో కోలాటాలు వేస్తూ భక్తులు స్వామివారిని ఊరేగింపుగా కల్యాణ మండపానికి తోడ్కొని వచ్చారు. ఈవో ఆదిత్య ఆధ్వర్యంలో శోభాయాత్రలో ఏర్పాట్లు చేశారు. తితిదే ఆధ్వర్యంలో ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు.

స్వాతంత్ర్య వేడుకలకు ప్రగతి మైదానం ముస్తాబు



మైదానాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే: స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు పురపాలకంలోని ప్రగతి మైదానం ముస్తాబవుతోంది. పతాకావిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆబ్కారీ శాఖ మంత్రి కత్తి పద్మారావు, స్థానిక ఎమ్మెల్యే జలగం వెంకటరావు, కలెక్టర్ రాజీవ్ గాంధీ, ప్రముఖులు హాజరవుతున్న నేపథ్యంలో భద్రతా చర్యలపై ఎస్పీ అంబర్ కిశోర్‌ఝా మైదానంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. సోమవారం సాయంత్రం మైదానంలో పరిస్థితులు, ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. రెవెన్యూ సిబ్బంది మైదానంలో ఏర్పాట్లను కొనసాగిస్తున్నారు. పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టేందుకు వీలుగా మైదానంలో ఏర్పాట్లు చేపడుతున్నారు. షామియానాలను ఏర్పాటు చేయడంలో సిబ్బంది నిమగ్నమయ్యారు. నూతన జిల్లాగా ఏర్పడిన తర్వాత తొలిసారిగా నూతనంగా ఏర్పడిన మైదానంలో స్వాతంత్ర దినోత్సవ ఉత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో అన్ని హంగులతో ఏర్పాట్లు చేపడుతున్నారు. మైదానాన్ని చదును చేసే పనులు చకచక సాగుతున్నాయి. ఆకర్షణీయంగా మైదానంలో ఏర్పాట్లు చేపట్టేందుకు సిబ్బంది పనులను నిర్వహిస్తున్నారు.

తుది దశకు చదరంగం పోటీలు

నేటితో ముగియనున్న అంతర్జాతీయ రేటింగ్ పోటీలు

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే: అంతర్జాతీయ రేటింగ్ పొందే జాతీయ చదరంగం పోటీలు ముగింపు దశకు చేరుకున్నాయి. సోమవారం ఖమ్మం కవితా మెమోరియల్ డిగ్రీ కళాశాలలో తొమ్మిది రౌండ్ పోటీలు కొనసాగాయి. మంగళవారం జరిగే పదో రౌండ్‌తో పోటీలు ముగియనున్నాయి. తొమ్మిదో రౌండ్ వరకు రవికుమార్ (తెలంగాణ) ఎనిమిది పాయింట్లతో ఆధిక్యంలో షేక్ సుమీర్ అరిఫ్(తెలంగాణ) 7.5 పాయింట్లతో, తెలంగాణ రాష్ట్రానికి చెందిన గౌస్ పాషా, మోహన్ అరగొండ (జగన్ చెస్ అకాడమీ), విశ్వనాథ్, కార్తికరెడ్డి, ఇమ్రోస్ తర్వాత స్థానాల్లో నిలిచారు. ఆరున్నర పాయింట్లతో నలుగురు, ఆరు పాయింట్లతో ఏడుగురు క్రీడాకారులు బరిలో నిలిచారు. పోటీల ముగింపు కార్యక్రమాన్ని కేఎంసీకే కళాశాల ఆడిటోరియంలో జరుగుతుందని గెలుపొందిన క్రీడాకారులతో పాటు పాల్గొన్న అందరు క్రీడాకారులకు ప్రోత్సాహక బహుమతులు అందించే సంప్రదాయాన్ని కొనసాగిస్తామని జాతీయ చదరంగం సమాఖ్య సభ్యుడు అనంచిన్ని వెంకటేశ్వరరావు తెలిపారు.

మిషన్ భగీరథ పనులను వేగవంతం చేయాలి: జలగం

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతి ఇంటికి తాగునీరు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన మిషన్ భగీరథ పథకం నీళ్లు ప్రజలకు డిసెంబరు నాటికి అందించాలంటే అధికారులు, గుత్తేదారులు పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని కొత్తగూడెం శాసనసభ్యుడు జలగం వెంకటరావు సూచించారు. సోమవారం మండల పరిధిలోని తోగ్గూడెంలో జరుగుతున్న మిషన్ భగీరథ నిర్మాణ పనులను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. తోగ్గూడెం గుట్టపై నిర్మిస్తున్న సంపును సందర్శించారు. నీటి సరఫరా పంపిణీ వ్యవస్థ ఒకే చోట ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. నీటి నిల్వ సమాచారాన్ని తెలుసుకునేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. క్లోరినేషన్ ప్రక్రియ కోసం తీసుకుంటున్న చర్యలపై ప్రస్తావిస్తూ ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న పిల్లర్లకు అదనంగా నీటి శుద్ధిని చేపట్టాలన్నారు. నీటిలో వచ్చే చెత్తను అడ్డుకునేందుకు నిర్మిస్తున్న గ్రిల్స్ సామర్థ్యం సరిపోదని, అధిక మోతాదులో ఏర్పాటు చేస్తే బావుంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఫిల్టర్ బెడ్ చుట్టూ ఇనుప రెయిలింగ్‌కు బదులు స్టెయిన్‌లెస్ స్టీల్ ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జిల్లాలో రూ.2,082 కోట్లతో చేపడుతున్న మిషన్ భగీరథ పనుల్లో రూ.245 కోట్ల పనులు నియోజకవర్గంలో జరుగుతున్నట్లు తెలిపారు. ఓహెచ్‌బీఆర్‌లు నియోజకవర్గంలో నాలుగు చేపట్టామని కొత్తగూడెం 4 ఇంక్లైన్, బంజర, రేగులగూడెం, బేతంపూడి వద్ద నిర్మాణాలు జరుగుతుని వివరించారు. తోగ్గూడెం పిల్టర్‌బెడ్ నిర్మాణం 145 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో గుట్టపై ట్యాంకు నిర్మాణం చేపట్టామన్నారు. పైపులైన్ జిల్లాలో 2,704 కిలోమీటర్ల ఉండగా నియోజకవర్గంలో 325 కి.మీ మేర చేపట్టి పూర్తి చేయడం జరిగిందన్నారు. చిన్న చిన్న సాంకేతిక సమస్యల్ని సరిచేసుకుంటూ డిసెంబరు నాటికి పూర్తి చేయాలన్న లక్ష్యంతో ముందుకు వెళుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఈ రవీందర్, పాల్వంచ జడ్పీటీసీ సభ్యుడు వాసు, కొత్తగూడెం ఎంపీపీ కేస్లీ, పాల్వంచ ఏడీఈ కిరణ్, ఎంపీడీవో ధనసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ అర్జున్‌రావు, ప్రశాంత్, నీలావతి తదితరులు పాల్గొన్నారు.



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

పనుల్లో నాణ్యతా లోపాలు

తెదేపా జిల్లా అధ్యక్షుడు తుళ్లూరి బ్రహ్మయ్య ఆరోపణ

అశ్వాపురం, న్యూస్‌టుడే: గోదావరి 'మిషన్ భగీరథ' పనుల్లో నాణ్యత లోపిస్తోందని, అధికారుల పర్యవేక్షణ కొరవడిందని తెదేపా జిల్లా అధ్యక్షుడు తుళ్లూరి బ్రహ్మయ్య ఆరోపించారు. అశ్వాపురం మండలం కుమ్మరిగూడెం వద్ద గోదావరి నదిపై ఇన్‌టేక్ వెల్ నిర్మాణం, మిట్టగూడెంలోని రథం గుట్ట వద్ద వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటు నిర్మాణం కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ పనులను తెదేపా నాయకుల బృందం సోమవారం సందర్శించింది. అనంతరం తుళ్లూరి బ్రహ్మయ్య విలేకరులతో మాట్లాడుతూ.. మిషన్ భగీరథ పథకం పనులు నేటికి నత్తనడకనే కొనసాగుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న ప్రకటనలకు, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులకు సంబంధం లేదన్నారు. హైదరాబాద్‌లో గత జనవరి నెలలో జరిగిన మిషన్ భగీరథ సమీక్షా సమావేశం సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. మార్చి చివరికల్లా తొలి విడతగా 3 వేల గ్రామాలకు తాగునీరు అందించగలమని చెప్పారని గుర్తుచేశారు. ఆ తర్వాత ఈ ఏడాది డిసెంబరు కల్లా రాష్ట్రంలోని అన్ని మిషన్ భగీరథ కార్యక్రమాలను పూర్తి చేస్తామన్నారని తెలిపారు. వాస్తవంగా పరిస్థితి చూస్తుంటే ఈ రెండు ప్రకటనలూ



వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటు తీరుతెన్నులను అడిగి తెలుసుకుంటున్న తెదేపా జిల్లా అధ్యక్షుడు తుళ్లూరి బ్రహ్మయ్య తదితరులు

నిజమయ్యే దాఖలాలు కనిపించడం లేదన్నారు. పైపులైను నిర్మాణం పద్ధతి ప్రకారం జరగడం లేదన్నారు. అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటంతో గ్రామాల్లో అంతంతమాత్రంగా ఉన్న రహదారులన్నీ ధ్వంసమయ్యాయని ధ్వజమెత్తారు. వెంటనే రహదారులను పునర్నిర్మించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. త్వరలోనే తమ పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి గోదావరి మిషన్ భగీరథ పనులను సందర్శించనున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి, తెదేపా మండల అధ్యక్షుడు సూదిరెడ్డి గోపాలకృష్ణారెడ్డి, అనుబంధ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మామిళ్ల నాగభూషణం, నెల్లిపాక సహకారసంఘం అధ్యక్షుడు మర్రి మల్లారెడ్డి, అశ్వాపురం సహకార సంఘం ఉపాధ్యక్షుడు వాసిరెడ్డి రమేష్‌బాబు, డైరెక్టర్ సజ్జా రమేష్, మండల పరిషత్తు కో ఆప్షన్‌సభ్యుడు షరీఫ్ యుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకతకు పెద్దపీట



కొత్తగూడెం సంక్షేమవిభాగం, న్యూస్‌టుడే

రేషన్ దుకాణాల్లో పారదర్శకత కోసం అమలు చేస్తున్న ఈ పాస్ విధానం జిల్లాలో పూర్తి స్థాయిలో అమలయ్యేందుకు మరో రెండు నెలలు పట్టనుంది. జిల్లాలోని 442 రేషన్ దుకాణాల్లో ఈ-పాస్ యంత్రాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. మొదటి దఫా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ఈ యంత్రాలను ఇప్పటికే ఏర్పాటు చేయగా సెప్టెంబరు నెల నుంచి కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో ఏర్పాటు చేయనున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రెండు నెలల్లో దుకాణాల వారీగా వీటిని ఏర్పాటుచేసి డీలర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

జిల్లాలో మొత్తం 442 రేషన్ దుకాణాలుండగా వీటి పరిధిలో 2,75,000మంది లబ్ధిదారులున్నారు. ప్రతి నెలా 5వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని డీలర్లు పంపిణీ చేస్తున్నారు. గతంలో పంచదార, పప్పులతో పాటు ఇతర నిత్యావసరాలు పంపిణీ చేశారు. ప్రస్తుతం కేవలం బియ్యం, నీలి కిరోసిన్ మాత్రమే పంపిణీ అవుతోంది. అయితే రేషన్ దుకాణాల్లో అవినీతి తగ్గించేందుకు పౌరసరఫరాల శాఖ ఇప్పటివరకు ఎన్నో ప్రయోగాలు చేసింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంతోపాటు జీపీఎస్ విధానం అమలు, డీలర్లపై నిరంతరం నిఘా, రెవెన్యూ అధికారులతో పర్యవేక్షణ, అక్రమంగా తరలిస్తే కఠిన కేసులు తదితర చర్యలన్నీ ఏ మాత్రం ఫలితాలు ఇవ్వలేదు. కానీ తాజాగా అమలు చేయనున్న ఈ పాస్ విధానం మాత్రం మంచి ఫలితాలు ఇవ్వనుంది.

అంతా పక్కాగా..

ఇప్పటికే డీలర్ల ద్వారా లబ్ధిదారుల ఫోన్ నెంబర్లు సేకరిస్తున్నారు. ఫోన్ నెంబర్లు నమోదు చేసిన వారికి ఈ పాస్ యంత్రాలు ప్రారంభమైన తరువాత బియ్యం కోటా దుకాణానికి రాగానే సంక్షిప్త సందేశం వస్తుంది. అదెలాగంటే ఒకరి కోటా నెలకు 12 కిలోల బియ్యం అనుకుందాం.. 'మీ 12 కిలోల బియ్యం కోటాను సంబంధిత డీలరు నుంచి పొందగలరు' అని సందేశం చరవాణికి వస్తుంది. గతంలో మాదిరిగా డీలరు వచ్చాడా..? బియ్యం వచ్చాయా..? అని తిరగాల్సిన అవసరం ఇక ఉండదు.

- ఈ పాస్ యంత్రంలో గతంలో ఆధార్ కార్డు ద్వారా సేకరించిన బయోమెట్రిక్ విధానం ద్వారా కోటా పంపిణీ జరగనుంది.
- ఒక కుటుంబంలో నలుగురు లబ్ధిదారులుంటే ఎవరైనా ఒకరు డీలరు వద్దకు వెళ్లి బయోమెట్రిక్ ద్వారా నెలకోటాను పొందవచ్చు.
- ప్రతీ నెల కోటా డీలరు వద్దకు రాగానే సంక్షిప్త సందేశం వస్తుంది. తిరిగి కోటా పొందగానే సందేశాన్ని చేరవేస్తారు.
- మీరు తీసుకున్న బియ్యం, కిరోసిన్‌కు సంబంధించి ఈ-పాస్ యంత్రమే వాయిస్ మెసేజ్‌ను వినిపిస్తుంది. ఉదాహరణకు 6 కిలోల బియ్యం తీసుకుంటే తక్షణం మీరు 6 కిలోల బియ్యం పొందుతున్నారు.. అని ఈపాస్ యంత్రం తెలుగులో వినిపిస్తుంది.
- ఈ విధానం అమలైతే డీలర్లు ఒక కిలో బియ్యాన్ని కూడా తేడా ఉంచకుండా లెక్కలు చూపాల్సి ఉంటుంది. ఇదే సమయంలో ప్రతీ నెలా మిగిలే కోటా తిరిగి ప్రభుత్వానికి చేరనుంది.

ఇప్పటికే అమలవుతున్న జిల్లాలే సాక్ష్యం..

ఈ పాస్ విధానాన్ని తొలుత హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలో అమలు చేశారు. అక్కడ ఈ విధానం మంచి ఫలితాలు ఇచ్చింది. మొదటి నెలలోనే ఉభయ జిల్లాల్లో వందల మెట్రిక్ టన్నుల బియ్యం మిగులు కోటా వెనక్కి వచ్చింది. దీంతో ప్రభుత్వంపైన భారం తగ్గినట్లైంది. ఈ నేపథ్యంలో అన్ని జిల్లాల్లో విడతల వారీగా ఈ విధానాన్ని అమలు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

అవగాహన ఇలా..

ఈపాస్ యంత్రాలను రేషన్ దుకాణాల్లో ఏర్పాటు చేసిన అనంతరం వీటిపై డీలర్లకు అవగాహన కల్పించనున్నారు. డీలర్లతో పాటు లబ్ధిదారులకు కూడా వివరిస్తారు. నిత్యం పర్యవేక్షణ చేసే అధికారులకు కూడా ఈ పాస్‌పై పూర్తి అవగాహన కల్పిస్తారు. ఇందుకోసం జిల్లా స్థాయిలో కార్యశాలను ఏర్పాటు చేయనున్నారు.



మరో రెండు నెలల్లో అమల్లోకి..: అమృతరెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి


వచ్చే నెల నుంచి కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో అమలు ఈపాస్ యంత్రాలను ఏర్పాటు చేయనున్నారు. మన జిల్లాకు ఈ యంత్రాలు రావడానికి మరో రెండు నెలలు పట్టే అవకాశం ఉంది. యంత్రాలు ఏర్పాటైతే ఒక్క కిలో బియ్యం కూడా తప్పుదోవ పట్టే అవకాశం ఉండదు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి మృత్యువాత

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో సోమవారం చోటు చేసుకున్న వేర్వేరు ఘటనల్లో నలుగురు మృతిచెందారు. మరో ఘటనలో వ్యక్తి చికిత్సపొందుతూ మృత్యువాతపడ్డాడు.

ఇసుక రాశిపై పడి... శ్వాస ఆడక యువకుడి మృతి

ఇల్లెందు, న్యూస్‌టుడే: ఇసుక రాశిపై పడి... శ్వాస ఆడకపోవడంతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని ఆర్ఆర్ కొత్తకాలనీకి చెందిన నగరి జగదీశ్(36) శ్వాస ఆడక మృతిచెందాడు. ఆర్ఆర్ కాలనీ నుంచి దినపత్రికను తెచ్చుకునేందుకు జేకే కాలనీ వరకు వచ్చిన జగదీశ్ తిరిగి ఇంటికి వెళ్తుండగా సమీపంలోని ఇంటి ఎదుట ఉన్న ఇసుక కుప్పపై బోర్లా పడ్డాడు. దీంతో శ్వాస ఆడకపోవడంతో మృతి చెందినట్లు వైద్యుడు పేర్కొన్నారు. జగదీశ్ మృతి వార్త తెలుసుకున్న ఎస్సై కొమురెల్లి ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. శవపరీక్షల నిమిత్తం ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలకు జగదీశ్ మృతదేహాన్ని తరలించారు. శవపరీక్షలు వైద్యుడు రమేశ్ నిర్వహించారు. శ్వాస ఆడకనే మృతిచెంది ఉంటాడనీ, ముక్కు, గొంతులో కూడా ఇసుక రేణువులు ఉన్నాయని గుర్తించినట్లు వైద్యుడు తెలిపారు. మృతుడికి భార్య భార్గవి, ఆర్నెల్ల బిడ్డ ఉన్నారు. ఈ నెల 16, 17 నూతనంగా నిర్మించుకున్న ఇంటి గృహ ప్రవేశంతోపాటు బిడ్డ అన్నప్రాసన జరిపేందుకు కుటుంబసభ్యులు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో జగదీశ్ మృతి ఆ ఇంట్లో పెనువిషాదం నింపింది. కుటుంబసభ్యులు, భార్య మృతదేహంపై రోదిస్తున్న తీరు అక్కడున్న వారిని కలిచివేసింది. ఎస్సై కొమురెల్లి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



జగదీశ్ మృతదేహం

క్రేన్ పల్టీ కొట్టి బిహార్ యువకుడు..



రాకేశ్‌కుమార్

కొణిజర్ల, న్యూస్‌టుడే: క్రేన్ పల్టీ కొట్టి క్లీనర్ మృతిచెందిన సంఘటన సోమవారం చిన్నమునగాల వద్ద చోటుచేసుకుంది. ఎస్సై కృష్ణ కథనం ప్రకారం.. మిషన్ భగీరథ పనులను ముగించుకుని బిహార రాష్ట్రానికి చెందిన అన్నదమ్ములు డ్రైవర్ మజు దీపక్, క్లీనర్ మజు రాకేశ్‌కుమార్(18) క్రేన్‌తో తిరిగి ప్రయాణమయ్యారు. ఈ నేపథ్యంలో చిన్నమునగాల సమీపంలోని మూలమలుపు వద్ద ఒక్కసారిగా క్రేన్ అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఈ సంఘటనలో క్లీనర్ రాకేశ్‌కుమార్ క్యాబీన్ కింద పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవర్ దీపక్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడు బిహార్ రాష్ట్రం శివం జిల్లాకు చెందినవారు.

నీటి గుంతలో పడి రైతు..

తిరుమలాయపాలెం, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు వ్యవసాయ బావి వద్దనున్న నీటిగుంతలో పడి ఓ రైతు మృతి చెందిన ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. మండల కేంద్రానికి చెందిన చిర్ర శ్రీను(40) ఆదివారం మధ్యాహ్నం సమయంలో తన కున్న వ్యవసాయ భూమిలో వరి నాటు వేసేందుకు బురద పనులు చేస్తున్నాడు. ఈ తరుణంలో శ్రీను తనకు అంటిన బురదను కడుక్కోవడానికి బావి వద్ద(మోటారుతో నీరు పోస్తున్న) గుంత వద్ద కెళ్లి బురదను కడుక్కుంటుండగా కాలు జారి గుంతలో ఉన్న బండరాయిపై పడ్డాడు. దీంతో నుదురిపై బలమైన గాయమైంది. దీంతో గుంతలో పడి ఊపిరాడక మృతి చెందాడు. మధ్యాహ్నభోజనం తీసుకెళ్లిన ఇతని కుమార్తె తండ్రి మృతదేహం చూసి తల్లడిల్లిపోయింది. సమాచారం అందిన పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. మృతుడికి ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నారు.



శ్రీను మృతదేహం

విద్యుదాఘాతంతో మహిళ..

సుజాతనగర్, న్యూస్‌టుడే: విద్యుదాఘాతానికి గురై మహిళ మృతి చెందిన ఘటన సుజాతనగర్ మండల పరిధిలోని సింగభూపాలెం గ్రామంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే సింగభూపాలెం నాయకపోడుకు చెందిన ఇనుముల అరుణ(30) సోమవారం రాత్రి 7 గంటల సమయంలో ఇంటి వద్ద ఉన్న ఇనుప స్తంభాలకు కట్టిన ఇనుప తీగలపై ఉతికిన బట్టలు ఆరవేయడానికి వెళ్లింది. విద్యుదాఘాతానికి గురయ్యారు. దీంతో సమీపంలోనే ఉన్న ఆమె తల్లి సత్యవతి అరుణను రక్షించేందుకు ప్రయత్నించగా ఆమె సైతం విద్యుదాఘాతానికి గురయ్యారు. స్థానికులు గమనించి ఇద్దరిని రక్షించే ప్రయత్నం చేశారు. ఇద్దరినీ కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అరుణ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సత్యవతి పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మంకు మెరుగైన చికిత్సకోసం తరలించారు. అరుణకు భర్త వెంకటేశ్వర్లు ఇద్దరు పిల్లలున్నారు. ఇంటికి ఎర్త్ ఫెయిల్ కావటంతో విద్యుత్ సరఫరా అయి ప్రమాదం జరిగిందని సమాచారం. మృతురాలు, ఆమె భర్త కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తారని స్థానికులు తెలిపారు.



అరుణ మృతదేహం

చికిత్స పొందుతూ వ్యక్తి..

కొణిజర్ల, న్యూస్‌టుడే: చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందిన సంఘటన ఇది. కొణిజర్ల మండలం కొండవనమాలకు చెందిన ఉప్పర్ల వెంకటయ్య(55) అనారోగ్య కారణాలతో గత నెలలో వెన్నుపూస శస్త్రచికిత్స చేయించుకున్నారు. అనారోగ్య సమస్య వేధిస్తోండటంతో ఈ నెల 2న ఇంట్లో ఎవరూ లేని సమయంలో కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశారు. ఈ సంఘటనలో తీవ్ర కాలిన గాయాలైన వెంకటయ్యను ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ వెంకటయ్య సోమవారం మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణ తెలిపారు.

రూ. 4 లక్షల గుట్కా పొట్లాలు స్వాధీనం



గుట్కా పొట్లాలతో పట్టుబడిన నిందితులు, వెనుక సీఐ. రమేశ్, ఎస్.ఐ. పవన్, సిబ్బంది

కల్లూరు, న్యూస్‌టుడే: అడ్డదారుల్లో పక్క రాష్ట్రానికి భారీగా గుట్కా పొట్లాలను తరలిస్తున్న ఆటోను పోలీసులు పట్టుకున్నారు. సీఐ మడత రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్‌ను అడ్డాగా చేసుకుని ఆర్టీసీ వాహనాల్లో దుస్తుల సంచులని అబద్ధం చెప్పి గుట్కా ప్యాకెట్లను కొంతదూరం తరలించి, అక్కడి నుంచి అవసరమైన ప్రాంతాలకు ఆటోల్లో గుట్కా ప్యాకెట్లను కొందరు తరలిస్తున్నారు. బోనకల్ మండలానికి చెందిన మోర్ల లక్ష్మణ్ రావు అనే వ్యాపారి హైదరాబాద్ నుంచి గుట్కా పొట్లాలను మైలవరం వద్దకు చేర్చి అక్కడి నుంచి ఆటో డ్రైవర్ బెనర్జితో కలసి ఆంధ్రప్రదేశ్‌లోని మైలవరానికి వీటిని తరలిస్తున్నారు. కల్లూరు మండలం చిన్నకోరుకొండి సమీపంలో ఆటోను ఎస్సై పవన్ కుమార్, సిబ్బంది రామకృష్ణలు వెంబడించి పట్టుకున్నారు. ఆటోను సీజ్‌చేసి రూ. 4 లక్షల విలువైన గుట్కాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టుచేసి కేసు నమోదు చేశారు.

నవ భారత నిర్మాణంలో మనం



"కరేంగే యా మరేంగే.. సాధిస్తాం లేదా ప్రాణాలర్పిస్తాం అనే నినాదం క్విట్ ఇండియా ఉద్యమంలో ప్రతిధ్వనించింది. ఇప్పుడు దీన్నే 'కరేంగే ఔర్ కర్ కే రహేంగే' (మేం సాధిస్తాం, తప్పకుండా చేస్తాం) అనే ప్రతిజ్ఞగా మార్చుకుని ఈ దేశానికి పలు సామాజిక రుగ్మతల నుంచి విముక్తి కల్పిద్దాం. పేదరికం, నిరక్షరాస్యత, అవినీతి అంతం చూద్దాం".

- ఆగస్టు 9న క్విట్ ఇండియా దినోత్సవ 75వ వార్షికోత్సవం సందర్భంగా లోక్‌సభలో చేసిన ప్రసంగంలో ప్రధాని మోదీ.

- ◆ ఉభయ జిల్లాలను వేధిస్తున్న సామాజిక సమస్యలెన్నో..
- ◆ పేదరికం, నిరక్షరాస్యత, అవినీతి అంతం చూద్దాం
- ◆ 'క్విట్ ఇండియా సందేశం' స్ఫూర్తిమంత్రం

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన పథకాలు సామాజిక రుగ్మతలను రూపుమాపేందుకు కృషిచేస్తున్నాయి. కానీ వాటిని అమలు చేయడంలో పాలనా యంత్రాంగం, అభివృద్ధి ఫలాలను అందిపుచ్చుకోవటంలో ప్రజలు కొంత వెనకబడి ఉన్నారు. తెలంగాణ మానవాభివృద్ధి నివేదికలో 2004-05లో అవిభాజ్య ఖమ్మం జిల్లా 7వ ర్యాంకు రాగా.. 2011-12కు వచ్చే సరికి 5వ ర్యాంకుకు ఎదగడం ఆశావహ పరిణామం. విద్యా, వైద్యం రంగాల్లో గతంలో కంటే కాస్త పురోగతి సాధించడం విశేషం. ఈ నేపథ్యంలో ఉభయ జిల్లాలో ముఖ్యమైన సామాజిక రుగ్మతలు-వాటి నిర్మూలన మార్గాలను పంద్రాగస్టు సందర్భంగా అవలోకం చేస్తే.. **- కొత్తగూడెం**

1942లో వలసవాద బ్రిటీష్ ప్రభుత్వం నుంచి విముక్తి పొందడానికి యావత్ ప్రజలు కలిసికట్టుగా పోరాడారు. ఇన్నేళ్ల తర్వాత నేడు సమాజంలో వేళ్లూనుకున్న ఎన్నో సామాజిక రుగ్మతలను పారదోలడానికి ప్రతి పౌరుడు 'మేం సాధిస్తాం, తప్పకుండా చేస్తాం' అంటూ ప్రతినబూనాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. వ్యక్తిగా ఒక్క అడుగైనా ముందుకు వేయనిదే.. సమాజ మార్పును కోరుకోవడం తగదు. ఏడు దశాబ్దాల స్వాతంత్ర్యావనిలో ఇంకా పేదరికం, అవినీతి జనాన్ని బాధిస్తున్నాయంటే, బాధ్యతగల ప్రతి పౌరుడు ఆలోచించాల్సిన తరుణమిదే. ఇప్పటికీ ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల్లో పౌష్టికాహార లోపంతో బాధపడే పిల్లలు, గర్భిణులున్నారు. అవినీతి, ఆశ్రిత పక్షపాతం కారణంగా సంక్షేమ ఫలాలకు నోచుకోని అభాగ్యులున్నారు. స్వచ్ఛత ప్రాధాన్యమెరుగని పల్లెలున్నాయి. అక్షరమెరుగని బాల్యమూ ఉంది. దశాబ్దాలుగా బాధిస్తున్న సామాజిక రుగ్మతలను ఏ ఒక్కరోజులోనో ప్రభుత్వాలు, అధికారయంత్రాంగాలు పారదోల లేవు. బాధ్యతగల పౌరులు, చైతన్యవంతమైన స్వచ్ఛంద సంస్థలు, చిత్తశుద్ధితో పనిచేసే అధికారయంత్రాంగం.. ఇలా కలిసికట్టుగా శ్రమిస్తే ఏదైనా సాధ్యమే. మోదీ ఆకాంక్షించినట్లు ఐదేళ్లలో (2017-2022) సరికొత్త భారతావని రూపకల్పన సుసాధ్యమే. ఈ నేపథ్యంలో ఉభయ జిల్లాలను బాధిస్తున్న సామాజిక రుగ్మతలు, వాటి నిర్మూలనకు ప్రభుత్వాల పరంగా జరుగుతున్న కృషి, కావాల్సిన జనచైతన్యంపై 'న్యూస్‌టుడే' 'పంద్రాగస్టు' ప్రత్యేక కథనం.





మేల్కొనరేం



**దేశం పేరు చెబితేనే.. మది అణువుణువునా పులకిస్తుంది
మరి దేశాన్ని దోచుకుతింటుంటే..
ఒక్కరిలోనూ చలనమే కనిపించదేం?**

**జెండా వందనానికి పిడికిలి బిగిస్తాం..
జాతిని విడగొడితే వేలెత్తైనా చూపరేం
గొంతెత్తి జాతీయ నినాదాలు చేస్తాం..
దారుణాతిదారుణాలు.. మారణ హోమాలు
జరుగుతున్నా మాట పెగలదేం?**

**అచేతనాన్ని వదిలేద్దాం.. చైతన్యం రగిలిద్దాం
చిత్తశుద్ధి లేని చెత్త ప్రసంగాలను ఆలకిద్దాం
అవినీతి, కుల, నేర, అ'రాజకీయ'
రంగుల్ని నిలువునా కడిగేద్దాం
జాతీయ గీతాన్ని ముక్తకంఠంతో ఆలపిద్దాం**

రాసిన వారు: కోట ఉదయ్‌తేజ్, మధిర

మా తుఝే సలాం..

దేశ రక్షణకై సరిహద్దులో పహారా కాస్తూ,
స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను కాపాడే జవాన్లతో..
నదుల ప్రవాహాలతో పుడమిని సాగుచేస్తూ,
గరిసెలన్ని ధాన్యాలతో నింపే కిసాన్లతో..
వెలుగులీనే నవ భారతమా.. తుఝే సలాం!

ప్రపంచ ప్రగతి సూచికకు దిక్సూచిగా,
ఉగ్రవాదంపై పోరుకు పెద్దన్నగా,
అహింసా సిద్ధాంతాలు వెల్లివిరియగా,
ప్రపంచ శాంతి పావురాన్ని ఎగరేసే
శాంతికాముకమా తుఝే సలాం!!

'హంసబ్ ఏక్ హై' నినాదంతో
'మేరా దేశ్ మహాన్ హై' గర్జనతో
'సారే జహాసే అచ్ఛా' గేయంతో
బుద్ధుని శాంతి గీతికలు పల్లవించే..
స్వేచ్ఛా గేయమా.. తుఝే సలాం!

నరేంద్రుని ప్రసంగాలే స్ఫూర్తిగా,
'కలాం' కలల సాకారం దిశగా,
వృద్ధి... అభివృద్ధి జోడు గుర్రాలై..
పరుగెత్తే రథమా.. తుఝే సలాం!!

పూజలు, నమాజ్‌లు, ప్రార్థనల ఫలాలతో,
స్వేచ్ఛా స్వాతంత్ర్య సౌభ్రాతృత్వాల నీడలో
మువ్వన్నెల రెపరెపల నీడలో,
కోటాను కోట్ల జాతి మదిలో..
సమరయోధులకు, సరిహద్దు అమరులకు,
ముష్కరమూకలను ఎదురొడ్డే వీరులకు,
పంద్రాగస్టు పర్వదినాన..
తుఝే సలాం!!!



కవిత పంపినవారు: సయ్యద్ షఫీ, ఉపాధ్యాయుడు, ఖమ్మం

- ఖమ్మం అర్బన్, న్యూస్‌టుడే

పౌష్టికాహారం

నేటి బాల్యానికి పోషకాహారం ఎంతో కీలకం. రేపటి పౌరులైన బాలలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం, దేశం ఆరోగ్యంగా ఉంటుంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 1,49,559 మంది ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ, వసతి గృహ విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయగా.. 16,025 మందికి మెరుగైన వైద్య సేవలు అవసరమని రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం ద్వారా గుర్తించారు. పోషకాహార లోపంతో 282, బరువు తక్కువగా ఉండటం 253 మంది విద్యార్థులు బాధపడుతున్నట్లు అధికారికల లెక్కలు చెబుతున్నా, ఇంకా గుర్తించిన వారు వేలల్లోనే ఉన్నారు. జిల్లాలోని 2,060 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పౌష్టికాహారం అందిస్తున్నా, క్షేత్రానికే వైద్య సేవలను చేరువ చేస్తున్నా.. అవి పూర్తిస్థాయిలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందడం లేదన్నది నిజం. ఫలితంగా చిన్నారులు, బాలింతల వైద్య ఖర్చులకు ప్రభుత్వంపై ఏటా రూ.వందల కోట్ల భారం పడుతోంది. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలను, ఆసుపత్రులను పటిష్టం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషిచేస్తున్నాయి. ఇదే సమయంలో చిన్నారుల తల్లిదండ్రులు, ప్రభుత్వ అధికారులు, సేవా సంస్థలు, పాలకులు సమష్టి కృషితో సాగితే ఆరోగ్యవంతమైన బాల్యాన్ని, తద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని తీర్చిదిద్దడంలో కృషిచేసిన వారు అవుతారు.



నిరక్షరాస్యత

అవిభాజ్య ఖమ్మం జిల్లాలో సుమారు 20 వేల మంది బడికి దూరంగా ఉంటున్నారు. ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ పథకాల ద్వారా సమాజంలో అనాథలు అనే ముద్రతో తిరుగుతున్న 1,870 మంది పిల్లలను తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. వీళ్లకు చదువు చేరేలా మనవంతు బాధ్యతగా సమాజం కృషి చేయాలి. సరైన అవగాహన లేకపోవటం, పేదరికం కూడా ప్రధాన కారణమవుతోంది. కొత్తగూడెం భద్రాద్రి జిల్లాలో 1850 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో 1.67 లక్షల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. స్వచ్ఛంద సేవలు కూడా ఆపన్నహస్తం అందిస్తున్నాయి. ప్రతి పిల్లవానికి చదువు దక్కేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అక్షరాస్యత 62.63 శాతం ఉంది. ఇందులో పురుషులు 66.9 శాతం, మహిళలు 53.12 శాతం ఉన్నారు. 2011-12 ఉమ్మడి జిల్లాలో అక్షరాస్యత శాతాన్ని పరిశీలిస్తే పురుషులు 72.3 శాతం మంది ఉండగా, స్త్రీలు 57.4 శాతం మంది ఉన్నారు. విద్యా సూచిలో 2004-05లో 7వ ర్యాంకు ఉంటే 2015-16లో గణనీయంగా 3వ ర్యాంకు సాధించింది. విద్యా వ్యవస్థలో హాజరుశాతం పెరగడం, డ్రాప్ అవుట్స్ తగ్గడంతో విద్యా సూచీ గతంలో కన్నా మెరగైంది. ప్రతి ఇంటిలో కనీసం ఒక్కరిని డిజిటల్ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని కేంద్ర ప్రభుత్వం 'ప్రధానమంత్రి గ్రామీణ డిజిటల్ సాక్షరతా అభియాన్' పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా గ్రామాల్లోని డిజిటల్ సేవా కేంద్రాల్లో 14 నుంచి 60 ఏళ్ల వయసు వారికి ఉచితంగా కంప్యూటర్ విద్యను నేర్పిస్తారు. మహిళా సంఘాల సభ్యులకు కూడా విద్యను నేర్పిస్తున్నారు. ట్యాలీ, ప్యాడ్, భావవ్యక్తీకరణ వంటి వృత్తి నైపుణ్యమైన కోర్సులు కూడా అందిస్తున్నారు.



జిల్లా వ్యాప్తంగా 117 పంచాయతీల్లో ఇప్పటికే డిజిటల్ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. మిగిలిన 88 పంచాయతీల్లో డిసెంబరు నాటికి డిజిటల్ కేంద్రాల ఏర్పాటు పూర్తవుతుంది. ఈ అవకాశాలను ఒడిసిపట్టుకున్నప్పుడే నిరక్షరాస్యత దూరమై.. సాంకేతిక దరిచేరుతుంది.

పేదరికం

ఖమ్మం జిల్లాలో దారిద్ర్య రేఖకు దిగువన 3,95,840 కుటుంబాలు (ఆహార భద్రత కార్డుల లెక్కన చూస్తే).. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2,75,540 కుటుంబాలున్నాయి. పేదరిక నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలు చేపడుతున్నాయి. కానీ.. క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగ నిర్లక్ష్యం.. నిరక్షరాస్యులపైన పేద కుటుంబాల్లో కొరవడిన చైతన్యం. . వెరసి ఫలాలు పక్కదారి పడుతున్నాయి. ఈ నేపథ్యంలో పాలనలో పారదర్శకతకు పాలకులు పెద్దపీట వేసినప్పుడు, చైతన్యవంతమైన సమాజం ఇరుగుపొరుగు అభివృద్ధికి బాటలు పరిచినప్పుడు పేదరికం దానంతటదే సమసిపోతుంది. ఈ విషయాన్ని గుర్తించి వచ్చే ఐదేళ్లలోనైనా సమాజాన్ని పట్టిపీడస్తున్న ప్రధాన రుగ్మతపై సమర శంఖాన్ని ఈ పంద్రాగస్టు వేడుకగా పూరించాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది.

"రూ.500, రూ.1000 తీసుకొని ఓటు వేస్తే ఆ ఒక్క రోజుకే సరిపోతాయి. ఓటు వేసే సమయంలో ఒక్క నిమిషం ఆలోచించి సరైన నిర్ణయం తీసుకుంటే ఐదేళ్ల పాలన సక్రమంగా ఉంటుందనే విషయాన్ని ఓటర్లు గమనించాల్సి అవసరం ఎంతైనా ఉంది."



అవినీతిపై సమరం

అవినీతి నేటి సమాజంలో మర్రి వృక్షమై వేళ్లూనుకుంది. ప్రతి అంశంలో రాజకీయ జోక్యం అనివార్యమైంది. పాలనలో పారదర్శకత కోసం ప్రభుత్వాలు ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చాయి. కాగా ప్రభుత్వ కార్యాలయాల్లో, ఉద్యోగులకు లంచం ఇస్తేనే పని అవుతుందనే భావన కొనసాగుతోంది. అవినీతి రూపు మాపాలంటే ప్రతి పౌరుని ఆలోచనాధోరణిలో మార్పు రావాలి. మనం నిజాయితీగా ఉన్నప్పుడే ఎదుటి వారు కూడా నిజాయితీగా వ్యవహరిస్తారు. అప్పుడే అవినీతి రహిత సమాజం సాకారమవుతుంది. లంచావతారులను పట్టుకునేందుకు కేంద్ర ఉద్యోగుల కోసం సీబీఐ, రాష్ట్ర ఉద్యోగులకు ఏసీబీలను ఏర్పాటు చేసినా.. ఫిర్యాదుల సంఖ్య చూస్తే చాలా తక్కువగా ఉంది. అవినీతి అధికారులపై ఏసీబీకి ఫిర్యాదు చేయాలన్న అవగాహన ప్రజల్లో చైతన్యం లేకపోవడం గమనార్హం. 'మనకెందుకులే' అని రాజీ పడే ధోరణిలో నేటి సమాజం మగ్గుతోంది. ప్రజలు సహకరిస్తేనే ప్రభుత్వం లంచావతారుల పని పడుతుంది. ఈ విషయాన్ని అవినీతి నిరోధక శాఖ అధికారులూ పేర్కొంటున్నారు. అవిభాజ్య జిల్లాలో ఏసీబీ విభాగం అధికారులకు (9440446147, 9440700049) ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు. అక్రమాలకు, భూ దందాలు, రౌడీయిజం, హత్యా రాజకీయాలు చేసే రాజకీయ నాయకులకు ఎన్నికల సమయంలో బుద్ధి చెప్పాలి.


నిరుద్యోగం

అవిభాజ్య ఖమ్మం జిల్లాలో సుమారు 80 వేల మంది నిరుద్యోగులు ఉన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాల కోసం ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. కేవలం విద్యార్హత ఉంటే ఉద్యోగం వస్తుందనే భావన అనేక మంది యువకుల్లో నాటుకుపోయింది. ఏ ప్రభుత్వమైనా నిరు



ద్యోగుల సంఖ్యకు అనుగుణంగా ఉద్యోగాలు ఇవ్వలేదు. ప్రభుత్వాలు అందజేసే స్వయం ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలి. విద్యార్హతతో పాటు ప్రస్తుత సాంకేతిక పోకడలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంచుకోవాలి. రోజు రోజుకు మారుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి. హైదరాబాద్, వరంగల్ తర్వాత ఐటీలో పురోగతి సాధిస్తున్న ఖమ్మం పట్టణంలో టీ-హబ్‌కు అంకురార్పణ మొదలైంది. ఇది ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం యువతకు ఎంతో ఉపయోకరంగా ఉంటుంది. కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేసే వారికి తెలంగాణ ప్రభుత్వం పరిశ్రమల అనుమతులను సులభతరం చేసింది.

"ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తోంది. వినూత్న పరిశ్రమలను ఏర్పాటు చేసే వారికి వెన్నుదన్నుగా నిలుస్తోంది. ఈ అవకాశాలను వేలాది మంది యువత అందిపుచ్చుకోవాలి. తాను ఉపాధి పొందుతూ మరో నలుగురికి బాట చూపే ఆలోచన్న ఉన్నవారికి పారిశ్రామికవేత్తలు, పాలకులు ఎర్ర తివాచీ పరుస్తున్నారన్న విషయాన్ని మరువొద్దు. ఈ దిశగా యువ ఆలోచనలు సాగితే నిరుద్యోగ నిర్మూలన అనతికాలంలోనే సాధ్యమవుతుంది."



పారిశుద్ధ్యం



ఉభయ జిల్లాల్లో పారిశుద్ధ్యం ప్రధాన సమస్యగా మారింది. ఏజెన్సీ ప్రాంతాలు, గిరిజన తండాలు ఎక్కువగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అంటువ్యాధుల భారిన పడేవారు, మలేరియా, డెంగీ, గన్యా, విష జ్వరాలు, డయారియా బారినపడి ఏటా వందలాది మంది మృత్యు కోరల్లో చిక్కుతున్నారు. మున్సిపాలిటీల్లో చెత్తాచెదారం, గ్రామాల్లో మురుగు, అపరిశుభ్రత కారణంగా ప్రజారోగ్యం దెబ్బతింటోంది. ప్రభుత్వాలపైనా రూ.కోట్ల భారం పడుతోంది. బహిరంగా మలవిసర్జన చేస్తున్న అనేక గ్రామాలు నేడు తీవ్ర అనారోగ్యాలకు ప్రధాన నిలయాలుగా కునారిల్లుతున్నాయి. దేశాన్ని అవినీతి మాదిరిగానే పట్టిపీడిస్తున్న అపారిశుద్ధ్యంపై మోదీ నేతృత్వంలోని కేంద్రం సమర శంఖాన్ని పూరించింది. 'స్వచ్ఛభారత్' ఆయుధంతో అపారిశుద్ధ్యంపై పెద్ద యుద్ధమే చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వమూ ఇందుకు సహకరిస్తోంది. రూ.వేల కోట్లు ధారబోస్తున్నా, ప్రతి పౌరుడూ తన వంతుగా సెస్సు చెల్లిస్తున్నా.. క్షేత్రస్థాయికి వచ్చే సరికి చైతన్యం కొరవడుతోంది. స్వచ్ఛభారత్‌ను ఓ ప్రభుత్వ పథకంగా చూస్తున్నారే తప్ప.. వ్యక్తిగత పరిశుభ్రత వల్ల ఆరోగ్యవంతమైన కుటుంబాన్ని, సమాజాన్ని రూపొందించవచ్చని తెలుసుకోలేకపోతున్న వారెందరో. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరు తమ బాధ్యత అని భావించినప్పుడే 'స్వచ్ఛ' భారత్ సిద్ధిస్తుంది. ఆరోగ్యవంతమైన సమాజం దేశాభివృద్ధికి బాటలు పరుస్తుంది.

"★ ఖమ్మం జిల్లాలో 3,78,365 గృహాల్లో 2,25,316 మాత్రమే మరుగుదొడ్లు కలిగి ఉండగా.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2,19,260 గృహాలకు గాను 1,14,211 ఇళ్లల్లో మాత్రమే ఈ సౌకర్యాన్ని కలిగి ఉన్నారు. వచ్చే గాంధీ జయంతి అక్టోబరు 2 నాటికైనా బహిరంగ మల విసర్జన రహిత గ్రామాలను తీర్చిదిద్దుకునేందుకు పాలకవర్గాలు కృషిచేయాలి."

మహిళా సాధికారిత

మహిళల ఆర్థిక స్వావలంబనపైనే దేశాభివృద్ధి ఆధారపడి ఉందని ఆర్థిక రంగ నిపుణులు, మేధావులు పేర్కొన్నారు. స్వావలంబనను సాధించేందుకు ఎన్నో పథకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయి. ముఖ్యంగా పల్లెల్లో, పట్టణాల్లో మహిళాభివృద్ధికి ఆర్థిక వేదికలుగా నిలుస్తున్న స్వయం సహాయక సంఘాలను పరిశీలిస్తే.. ఉభయ జిల్లాల్లో 18,121 సంఘాలున్నారు. వీటిల్లో 1,64,867 మంది సభ్యులుగా మహిళలు ఉన్నారు. జాతీయ పట్టణ జీవనోపాధి మిషన్ ద్వారా 4,064 సంఘాలకు గాను 1,055 సంఘాలకు ఈ ఏడాది రూ.39 కోట్ల బ్యాంకు రుణాలు అందించారు. స్వయం ఉపాధి కింద 149 మంది సభ్యులకు రూ.139 కోట్ల రుణ సౌకర్యం కల్పించారు. 3 వేల పట్టణ స్వయం సహాయక సంఘాలకు రూ.104 కోట్ల బ్యాంకు రుణాలు అందించారు. 2,875 సంఘాలకు రూ.3.42 కోట్ల వడ్డీ రాయితీ మంజూరు చేశారు. స్త్రీ నిధి కింద 940 స్వయం సహాయక సంఘాలకు 6.63 కోట్లను రుణం అందించారు. ఇదంతా మహిళా స్వావలంబన, తద్వారా సాధికారతకు పెద్ద పీట వేసే పథకాలే.

ప్రభుత్వ పథకాలన్నింటినీ మహిళాలోకం గుర్తించి సద్వినియోగం చేసుకుంటే కుటుంబాన్ని చక్కదిద్దుకుని, తద్వారా దేశాభివృద్ధికి ఊతమిచ్చిన వారవుతారు.



స్వాతంత్ర్యం సాధించడం కోసం దేశం తరుఫున పోరాడిన వారు మనచుట్టూ ఎందరో ఉన్నారు. వారు ఎప్పుడూ వార్తల్లో వ్యక్తులు కారు. మనతోనే ఉంటున్నా వారి గొప్పతనాన్ని గుర్తించం. ఇలాంటి స్వాతంత్ర్య సమరయోధులు జిల్లాల్లో కొందరున్నారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి, దేశస్థాయి వరకు ఆయా దశల్లో జరిగిన స్వాతంత్రోద్యమంలో పాల్గొన్న పలువురిని.. 70 ఏళ్ల పంద్రాగస్టు పండుగ సందర్భంగా 'న్యూస్‌టుడే' పలకరించింది. ప్రస్తుత రాజకీయ, ఆర్థిక, దేశ పరిస్థితులపై మనోభావాలు వారి మాటల్లోనే..

పాల్వంచ పట్టణం, కొత్తగూడెం గ్రామీణం, న్యూస్‌టుడే

ఆర్థిక స్వాతంత్ర్యం సిద్ధించాలి

బదావత్ ఛత్రు



దేశ ప్రజలు స్వార్థానికి వెళ్లకుండా విద్వేషాలను మానాలి. ఒకరికొకరు సహకరించుకుంటూ దేశభక్తితో ముందుకెళ్లాలి. ప్రస్తుత రోజుల్లో మతాలకు సంబంధించిన వైషమ్యాలు పొడచూపుతున్నాయి. ఈ పరిణామం ఏమాత్రం మంచిది కాదు. స్వాతంత్ర్యం రాక ముందు మా బాల్యంలో, పూర్వీకులలో ఒకటే లక్ష్యం ఉండేది. అదే స్వాతంత్ర్యాన్ని సాధించడం. 70 ఏళ్ల కిందటే ఈ లక్ష్యాన్ని సాధించాం. భారత రాజ్యంగ నిర్మాత అంబేద్కర్ చెప్పినట్లు.. ఆర్థిక స్వాతంత్ర్యం, సమానత్వం సిద్ధించాయా? అని మనల్ని మనం ప్రశ్నించుకుంటే సమాధానం దొరకని పరిస్థితి. పాలకులు మారాలి.. ప్రజా చైతన్యం పెరగాలి. అప్పుడే నిజమైన స్వాతంత్ర్యం సిద్ధిస్తుంది.

మహిళా సాధికారత దిశగా అడుగులు

గుగులోత్ తావుర్యా



గత డెబ్బై ఏళ్ల కిందట ఉన్న దేశ ఆర్థిక పరిస్థితులకు నేటి పరిస్థితులకు మధ్య చెప్పలేని మార్పులొచ్చాయి. సామాన్యుడి ఆర్థిక శక్తి బాగా మెరుగుపడింది. గ్లోబలైజేషన్ ఏర్పడిన తరువాత ప్రజలకు ఉపాధి కల్పన బాగా పెరిగింది. గతంలో ఆర్థిక అవసరతలను ఆసరాగా చేసుకుని కొంతమంది బ్రిటీషు అధికారులు మహిళలపై అఘాయిత్యాలకు ఒడిగట్టేవారు. కానీ ప్రస్తుత రోజుల్లో మహిళలు సైతం అన్ని రంగాల్లో రాణిస్తూ సాధికారత దిశగా అభివృద్ధి చెందుతున్నారు. ఇది మంచి పరిణామం.

కాలంతో పాటే విలువలూ మాయం

భాగం నారాయణ, రాంనగర్, చుంచుపల్లి



స్వాతంత్రం వచ్చిన తొలినాళ్లల్లో ప్రతి వ్యక్తికీ కొన్ని విలువలు ఉండేవి. తొలినాళ్లల్లో అందరిలోనూ దేశభక్తి సాధారణంగా కన్పించేది. బ్రిటీష్ వారు, రజాకార్ల పాలనల నుంచి విముక్తి లభించిన తర్వాత కూడా సమాజంలో అందరూ కలిసికట్టుగా ఉండేవారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ దీనికి పునాదిగా చెప్పవచ్చు. ప్రస్తుతం సమాజాన్ని చూస్తుంటే చాలా బాధగా ఉంది. కొందరిలో దేశభక్తి మచ్చుకైనా లేదు. స్వాతంత్ర్య సమరయోధుల గురించి నేటి బాల్యానికి బొత్తిగా తెలియదు. చిన్నా, పెద్దా గౌరవం కొరవడింది. అడుగడుగునా బంధుప్రీతి, స్వార్థం పెరిగింది. విలువలకు హరించుకుపోయాయి. ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోయి వృష్టి కుటుంబాలు ఏర్పడ్డాయి.

నాడు నిస్వార్థం.. నేడు అడుగడుగునా స్వార్థం

పోసాని వెంకటప్పయ్య, విద్యానగర్‌కాలనీ, చుంచుపల్లి



స్వాతంత్ర్యానికి పూర్వం, ఆ తర్వాత దేశనాయకులు, గొప్ప వ్యక్తులు చెప్పిన మార్గాలను ప్రజలు ఆచరించేవారు. నిస్వార్థంతో ఉండేవారు. రాజకీయనాయకులు సైతం నైతిక విలువలతో ప్రజల కోసం పాటుపడేవారు. కుటుంబ వ్యవస్థలు గొప్పగా ఉండేవి. ఇప్పటి పరిస్థితులు దీనికి పూర్తి భిన్నం. అవినీతే ఎజెండాగా రాజకీయాలు కొనసాగుతున్నాయి. బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతం అడుగడుగునా రాజ్యమేలుతోంది. ఇది మనిషిలో విపరీత స్వార్థానికి నాంది పలికింది. ఇప్పుడు ఎవరిని తట్టినా.. డబ్బు సంపాదనే ప్రథమ అవధిగా మారింది. నాయకుల్లో నైతిక విలువలున్నవారిని వేళ్ల మీద లెక్కపెట్టవచ్చు. పాలన గాడితప్పుతుంటే.. సమాజం చెడు దిశగా పయనిస్తోంది. అప్పటి యువత దేశభక్తి, దేశాభివృద్ధిపై దృష్టిపెట్టి మంచి సమాజం కోసం కృషిచేస్తే.. నేటి తరం విదేశీ పోకడతో మాదకద్రవ్యాలు, తప్పుడు పనులతో వక్రమార్గంలో చెరసాలలో బంధీ అవుతోంది.

సింగరేణి సమాచారం

కొనసాగని సింగరేణి ఎన్నికల చర్చ

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే: సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల ప్రక్రియ కోసం సోమవారం హైదరాబాద్‌లో జరగాల్సిన చర్చ కొనసాగకుండానే ముగిసినట్లు జాతీయ కార్మిక సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఒప్పంద కార్మికులు చర్చ జరిగే సమయంలో ఆందోళన చేపట్టడంతో అర్ధాంతరంగా నిలిచిపోయినట్లు తెలిపారు. సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల నిర్వహణ కోసం జాతీయ కార్మిక సంఘాల నాయకులతో హైదరాబాద్‌లో సోమవారం చర్చించడానికి ప్రయత్నాలు సాగాయి. ఇందులో నాయకులు పాల్గొనేందుకు వెళ్లినప్పటికీ ఒప్పంద కార్మికుల సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఆందోళనలు కొనసాగడంతో నిలిచిపోయినట్లు తెలిపారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జీఎం పర్సనల్ ముజాహిద్

ప్రకాశం మైదానానికి స్వాతంత్ర్య వేడుకల కళ

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే: కొత్తగూడెం నడిబొడ్డున ఉన్న ప్రకాశం మైదానానికి స్వాతంత్ర వేడుకల కళ సంతరించుకుంది. మంగళవారం నిర్వహించనున్న స్వాతంత్ర వేడుకలకు మైదానాన్ని అందంగా తీర్చిదిద్దారు. వారం రోజులుగా సింగరేణి అధికారుల కమిటీ పర్యవేక్షణలో కొనసాగుతున్న పనులను సోమవారం సాయంత్రం జీఎం పర్సనల్ ఎం.మసూద్ ముజాహిద్, బృందం పరిశీలించారు. ఆకర్షణీయమైన షామియానాలను ఏర్పాటు చేశారు. దేశభక్తిని చాటుతూ విద్యార్థులు కళా ప్రదర్శనలు, నృత్యాలు ప్రదర్శించేందుకు అనువుగా మైదానంలో ఏర్పాట్లు చేపట్టారు. మైదానంలో అధికారులు ఆసీనులయ్యేందుకు ప్రత్యేకంగా గ్యాలరీ, ప్రేక్షకులు వీక్షించేందుకు, సింగరేణీయులకు బారికేడ్లు ఏర్పాటు చేశారు. అధికారులకు స్వాగతం పలికేందుకు ఏర్పాటు చేసిన స్వాగత ద్వారాన్ని రంగురంగులుగా తీర్చిదిద్దారు. ఏర్పాట్లలో లోపాలు లేకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జీఎం పర్సనల్ ముజాహిద్ కమిటీ బృందానికి సూచించారు.

ఒప్పంద సమస్యలపై భాజపా ఆధ్వర్యంలో ధర్నా

కొత్తగూడెం రామవరం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం సమస్యలను రాజకీయ కోణంలో చూస్తూ వాటిని పరిష్కరించకుండా కాలయాపన చేస్తుందని భాజపా జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం సింగరేణిలో పని చేస్తున్న ఒప్పంద కార్మికుల సమస్యల పరిష్కారానికి సంస్థ ప్రధాన కార్యాలయం ఎదుట పార్టీ ఆధ్వర్యంలో ధర్నాను నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీజిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ఒప్పంద కార్మికులకు కనీస వేతనం రూ.359 ఇవ్వాలని, ఒక నెల జీతం 8.33 శాతాన్ని ప్రోత్సాహకంగా ఇవ్వాలన్నారు. ఒప్పంద కార్మికులతోపాటు వాటి కుటుంబ సభ్యులకు సింగరేణి ఆస్పత్రిలో ఉచిత వైద్యసేవలను అందించాలని, కార్మికులకు హైపవర్ వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం ఈఎస్ఐ ఆస్పత్రిని మంజూరు చేయడానికి సిద్ధంగా ఉన్నప్పటికి సింగరేని యజమాన్య స్పందించడం లేదన్నారు. ఇప్పటికే భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్‌తో కలిసి కేంద్ర బొగ్గు శాఖ మంత్రిని పీయూష్ గోయల్‌ను కలిసి సమస్యలను విన్నవించామని, ఆయన వెంటనే స్పందించి సింగరేణి సీఎండీతో మాట్లాడినప్పటికి, రాష్ట్ర ప్రభుత్వ మొండివైఖరి కారణంగా సమస్యలు పరిష్కృతికి నోచుకోవడం లేదన్నారు. పట్టణాధ్యక్షుడు కామేశ్ మాట్లాడారు. ధర్నా అనంతరం సింగరేణి జీఎం(పర్సనల్) కె.బసవయ్యకు వినతి పత్రాన్ని అందజేశారు. భాజపా జిల్లా కార్యదర్శి యెర్రాం రాజు బెహరా, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కొండి ప్రభాకర్, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు బాబురావు, జిల్లా కార్యదర్శి మల్లేశ్, నాయకులు పడాల భాస్కర్, పైడిపాటి రవీందర్, మండల నాయకులు జెల్లారపు శ్రీనివాసరావు, లాల్ సింగ్‌నాయక్, పట్టణ ప్రధాన కార్యదర్శులు ఆదిమూల రాములు, నిరంజన్‌కుమార్, నోముల రమేశ్, రావుల ప్రవీణ్ కుమార్, షకిల్, సాయి పాల్గొన్నారు.



సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న భాజపా నాయకులు, శ్రేణులు

తాత్కాలిక కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఇల్లెందు పట్టణం(సింగరేణి), న్యూస్‌టుడే: సింగరేణి తాత్కాలిక కార్మికుల సమస్యలు పరిష్కరించాలని భాజపా పట్టణశాఖ అధ్యక్షుడు మామిడి రమాకాంత్ పేర్కొన్నారు. ఇల్లెందులోని ఏరియా జీఎం కార్యాలయం ఎదుట సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రమాకాంత్ మాట్లాడుతూ సింగరేణి పరిధిలో పని చేస్తున్న తాత్కాలిక కార్మికులు చాలీచాలని వేతనాలతో ఆర్థికంగా సతమతమవుతున్నారనీ, వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సింగరేణి తాత్కాలిక కార్మికులకు కనీస వేతనం రోజుకు రూ.359 చెల్లించాలనీ, కనీసం నెలకు 8.33శాతం బోనస్ ఇవ్వాలన్నారు. కార్మిక కుటుంబాలకు, డిపెండెంట్‌లకు ఈఎస్ఐ వైద్య సదుపాయం కల్పించాలనీ, హైపర్ కమిటీ వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణిలోని 12వందల మంది డిస్మిస్ కార్మిక కుటుంబాలకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి గతంలో కేంద్ర బొగ్గగని శాఖా మంత్రి పియూష్‌గోయల్‌ను కలిసి విన్నవించగా వారి సమక్ష్యంలోనే సీఎండీ శ్రీధర్‌కు సమస్యలు పరిష్కరించాలని సూచించినా జాప్యం జరుగుతున్నదన్నారు. అనంతరం ఏరియా జీఎం కందుకూరి లక్ష్మీనారాయణకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. నాయకులు నాళ్ల సోమసుందర్, ఈసం నరసింహారావు, ఎస్.శుక్లాల్ పాల్గొన్నారు.



జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న భాజపా నాయకులు

గిరిజన నిర్వాసితులను ఆదుకోవాలి

రెండో రోజు కొనసాగిన ఇల్లెందు ఓసీపీ నిర్వాసితుల దీక్షలు

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే: ఇల్లెందు ఓసీ గిరిజన నిర్వాసితులను సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు గిరిజన సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రెండు రోజులుగా కొత్తగూడెం జిల్లా కేంద్రంలో నిరాహార దీక్షలను చేస్తున్న విషయం విదితమే. రెండో రోజు సోమవారం తెలంగాణ ఐకాస జిల్లా అధ్యక్షుడు మల్లెల రామనాధం ప్రారంభించారు. అనంతరం దీక్షలకు మద్దతు తెదేపా నాయకులు మాలోతు రాందాస్‌నాయక్, సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషా, బసపా పట్టణ అధ్యక్షుడు కొండ జంపన్న, గిరిజన సంఘాల ఐకాస కన్వీనర్ వాసం రామకృష్ణదొర, ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు శివనాయక్, గుగులోతు రాజేష్‌నాయక్ తదితరులు సంఘీబావం తెలుపుతూ దీక్షలకు మద్దతునిచ్చారు. వారు మాట్లాడుతూ జీవో నెంబర్ 34 ప్రకారం సింగరేణిలో గిరిజన నిర్వాసితులకు ఉద్యోగాలను ఇస్తున్నట్లు హామీ ఇవ్వాలని, 665 పోస్టుల్లో కొన్ని ఉద్యోగాలను నిర్వాసితులతో భర్తీ చేయాలని, పరిహారం ఇవ్వని నిర్వాసితులకు ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న ధర ప్రకారం పరిహారం ఇవ్వాలని, పక్కా ఇళ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. సింగరేణి అధికారులు ఎన్నిసార్లు సమస్యను వివరించినా పట్టించుకోకపోవడాన్ని తప్పుబట్టారు.



దీక్షలను ప్రారంభిస్తున్న టీజేఏసీ అధ్యక్షుడు మల్లెల రామనాధం

సింగరేణి వ్యాప్తంగా 'స్వచ్ఛ పక్వాడా'

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ బొగ్గు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా జరిగే స్వచ్ఛ పక్వాడా కార్యక్రమాన్ని మంగళవారం కొత్తగూడెం కార్పొరేట్ సివిల్ కార్యాలయం ఆవరణలో సింగరేణి సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.శ్రీధర్ ప్రారంభించనున్నట్లు జీఎం పర్సనల్ వెల్ఫేర్ అండ్ సీఎస్ఆర్ ఎం.మసూద్ ముజాహిద్ పేర్కొన్నారు. సోమవారం కార్పొరేట్‌లో సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా ఈ నెల 16 నుంచి 31 వరకు కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. స్వచ్ఛ పక్వాడను విజయవంతం చేయడంలో సింగరేణీయులు, అధికారులు అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఎస్వీఎస్ఎస్ రామలింగేశ్వరుడు(జీఎం, హెచ్‌ఆర్‌డీ), జి.మురళీసాగర్‌కుమార్(జీఎం పర్సనల్ ఎస్వోటూ డైరెక్టర్ పా), బీఆర్ దీక్షితులు(డీజీఎం పర్సనల్), వి.ఖాదరేంద్రబాబు(డీజీఎం పర్సనల్), బి.నికోలస్(డీజీఎం పర్సనల్), కె.నారాయణ(డీవైపీఎం) పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న జీఎం మసూద్ ముజాహిద్

ఇల్లెందులో..ఇల్లెందు పట్టణం, న్యూస్‌టుడే: కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ ఆదేశానుసారం ఈ నెల 16నుంచి 31వరకు భూగర్భ గనులలో, విభాగాలలో స్వచ్ఛ పక్వాడ కార్యక్రమం ఇల్లెందు ఏరియాలో నిర్వహిస్తున్నట్లు సింగరేణి యాజమాన్యం సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ కార్యక్రమాల్లో భాగంగా పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్యం, పక్షోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. సింగరేణి ఉన్నత పాఠశాలలో క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సింగరేణి పక్వాడ కార్యక్రమాలను అధికారులు, కార్మికులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యం

✣ పద్మశాలీ సంక్షేమ భవనం ప్రారంభోత్సవంలో ఎంపీ రాపోలు

కొత్తగూడెం సాంస్కృతికం, న్యూస్‌టుడే: సమష్టిగా ఉంటేనే అభివృద్ధిని సాధించగలమని రాజ్యసభ సభ్యుడు రాపోలు ఆనంద్‌భాస్కర్ అన్నారు. ఆదివారంరాత్రి కొత్తగూడెం భజన మందిరం రోడ్‌లోని పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీభక్తమార్కండేయ పద్మశాలీ సంక్షేమ సేవా సంఘం భవనం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ ఆనంద్‌భాస్కర్ మాట్లాడుతూ.. ఐక్యత, పరస్పర సహకారంతోనే అభివృద్ధి సాధ్యపడుతుందని, పద్మశాలీయుల పేద, మధ్యతరగతి కుటుంబాల అభివృద్ధికి కృషి చేయాల్సిన అవశ్యకతను వివరించారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ అభివృద్ధిని సాధించాలన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన కమ్యూనిటీ భవనంలో సంఘ కార్యక్రమాలకు చక్కని వేదికవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర మహిళ ఆర్థిక సంస్థ అధ్యక్షురాలు గుండు సుధారాణి మాట్లాడుతూ. . అన్ని సామాజిక వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటును అందిస్తుందని, పద్మశాలీ మహిళలు అన్ని రంగాల్లో ముందడుగు వేయాలని ఆకాంక్షించారు. ఎంపీ పోంగులేటి శ్రీనివాసరెడ్డి, కొత్తగూడెం శాసనసభ్యుడు జలగం వెంకటరావు పద్మశాలీల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి కావాల్సిన సహకారాన్ని అందిస్తామని, వార్డులు స్వయం సంవృద్ధిని సాధించేలా ఆయా వార్డుల్లో కమ్యూనిటీ భవనాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తొలుత నూతన భవనాన్ని రాజ్యసభ సభ్యుడు ఆనంద్‌భాస్కర్ ప్రారంభించగా, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పులి గీత, పద్మశాలీ మహిళలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం సంఘం గౌరవాధ్యక్షుడిగా ఆముదాల వెంకటనర్సయ్య, గౌరవ సలహాదారుగా చంద్రమౌళి, జిల్లా అధ్యక్షుడిగా మోత్కూరి ధర్మారావు, ప్రధాన కార్యదర్శిగా కనుకుంట్ల కుమార్, ఉపాధ్యక్షులుగా పులి రాజశేఖర్, సమ్మయ్య, సత్యనారాయణ, వంగా వెంకట్, దాసరి దామోదర్, హరిప్రసాద్, కోదుమూరి సత్యనారాయణలతో పాటు సభ్యులతో కూడిన నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఎడవల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ గీత, గుండు సుధారాణి, చిత్రంలో రాజ్యసభ సభ్యుడు ఆనంద్‌భాస్కర్, ఎమ్మెల్యే జలగం, ఎంపీ పోంగులేటి

మహాసభల విజయవంతానికి పిలుపు

గోదావరిఖని, న్యూస్‌టుడే: సీఐటీయూ రాష్ట్ర 14వ మహాసభలను విజయవంతం చేయాలని సంఘం అధ్యక్షుడు టి.రాజారెడ్డి పిలుపునిచ్చారు. ఈనెల 21, 22 తేదీల్లో సెంటినరీకాలనీలో నిర్వహించనున్న సభలకు అధిక సంఖ్యలో కార్యకర్తలు హాజరు కావాలని కోరారు. ఇందుకు సంబంధించిన ప్రచార గోడప్రతిని స్థానిక శ్రామిక భవన్‌లో సోమవారం విడుదల చేశారు. 1970లో ప్రారంభమయైన సీఐటీయూకి అనుబంధంగా 1978లో సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భవించిందని, ఇప్పటి వరకు 13 రాష్ట్ర మహాసభలను జరుపుకున్నామని తెలిపారు. ఈ మహాసభల్లో కార్మికుల వేతన ఒప్పందంతో పాటు పింఛను, పదోన్నతులపై చర్చించి నిర్ణయాలు తీసుకుంటామన్నారు.

తీరు మారదా.. తిప్పలు తీరవా



అగ్నిమాపక శాఖ కార్యాలయంలో రెండు శకటాలు

సిబ్బంది కొరతతో పాత వాహనాన్ని వదిలించుకునే ప్రయత్నం

జిల్లా కేంద్రంగా మారినా తప్పని 'అగ్నిమాపక' కష్టాలు

కొత్తగూడెం నేరవార్తలు, న్యూస్‌టుడే

జిల్లా కేంద్రమైనా అగ్నిమాపక కార్యాలయంలో సమస్యలు పరిష్కారం కావటం లేదు. లీకేజీల సమస్యతో పాత వాహనం అరకొర సేవలందిస్తుండటంతో కొత్తగూడెం అగ్నిమాపక కార్యాలయానికి ఎట్టకేలకు కొత్త శకటం అందుబాటులోకి తెచ్చారు. సమస్య ఏమిటంటే ఇప్పుడు రెండు అగ్నిమాపక శకటాలకు సరిపడా సిబ్బంది లేదు. సిబ్బంది కొరత కారణంగా పాతదాని స్థానంలో కొత్తది కార్యాలయానికి పరిమితం చేసి పాత వాహనాన్ని పంపించే ఆలోచనలో అధికారులున్నట్లు సమాచారం. సిబ్బంది కొరతతో రెండు శకటాలను నిర్వహించలేని పరిస్థితుల్లో కొత్తగూడెం అగ్నిమాపక శాఖ ఉంది.

కొత్తగూడెం కార్యాలయంలో వాస్తవానికి స్టేషన్ ఫైర్ ఆఫీసర్‌తోపాటు మొత్తం 16 మంది విధులు నిర్వర్తించాల్సి ఉంది. జిల్లా కేంద్రం కావడం, ఏజెన్సీ ప్రాంతాల సంఖ్య అధికంగా ఉండటం వల్ల కొత్తగూడెంలో 32 మంది సిబ్బందిని కేటాయించాల్సిన ఆవశ్యకత ఉంది. ఈ శాఖలో ఎల్ఎఫ్, డ్రైవర్లు, ఫైర్‌మెన్లది ప్రధాన పాత్ర. డ్రైవర్ల సంఖ్య పూర్తిస్థాయిలో ఉండాల్సిన ఆవశ్యకత ఉంది. ప్రస్తుతం కొత్తగూడెంలో ముగ్గురు డ్రైవర్లు విధులు నిర్వర్తించాల్సి ఉండగా ఇద్దరు విధులు నిర్వర్తిస్తున్నారు. ఫైర్‌మెన్లు 10 మంది ఉండాల్సి ఉండగా ఏడుగురు మాత్రమే పనిచేస్తున్నారు. లీడింగ్ ఫైర్‌మెన్(ఎల్ఎఫ్)లు ఇద్దరు ఉండాల్సి ఉండగా ఒక్కరు మాత్రమే పనిచేస్తున్నారు. ఉన్న వాహనాన్ని నిర్వహించడానికే ప్రస్తుత సిబ్బంది అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

రెండు వాహనాలు తప్పనిసరి

కొత్తగూడెం అగ్నిమాపక శాఖ పరిధిలో మండలాల విస్తీర్ణం అధికంగా ఉంది. ప్రాంతాల సంఖ్య సైతం ఎక్కువే. కొత్తగూడెం, పాల్వంచ, ములకలపల్లి, చంద్రుగొండ, జూలూరుపాడు, ఏన్కూరు, టేకులపల్లి, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాలకు ఒకే వాహనంతో అగ్నిప్రమాదాల నివారణ కష్టసాధ్యంగా మారుతోంది. అందులోనూ జిల్లా కేంద్రం కావడంతో మరింత అప్రమత్త అవసరం. ఇతర మండలాల నుంచి అగ్నిమాపక శకటాలు వచ్చే సరికి పుణ్యకాలం కాస్త గడిచిపోయి బూడిదే మిగులుతోంది. ఇలాంటి పరిస్థితుల దృష్ట్యా కొత్తగూడెంలో రెండు అగ్నిమాపక శకటాలు ఏర్పాటు చేయాలని ఎంతో కాలంగా ఇక్కడి అధికారులు మొరపెడుతూనే ఉన్నారు. అయినా ఉన్నతాధికారుల నుంచి స్పందన లేకపోవడంతో అరకొర సేవలతో సాధ్యమైనంత వరకు ప్రమాదాల నివారణలో సిబ్బంది శ్రమిస్తున్నారు.

రెండింటిని నిర్వహిస్తాం

రామకృష్ణ, స్టేషన్ ఫైర్ ఆఫీసర్

కొత్తగూడెంలో రెండు శకటాలను విధిగా నిర్వహిస్తాం. కొత్తగా 400 మంది ఫైర్‌మెన్లు శిక్షణలో ఉన్నారు. త్వరలో కొంత వరకు సిబ్బంది కేటాయింపు కొత్తగూడెంలో జరిగే అవకాశాలున్నాయి. పూర్తిస్థాయిలో ప్రస్తుతం ఉన్న సిబ్బంది సంఖ్యను రెట్టింపు చేస్తే మేలు జరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం కొత్తగూడెం శాఖకు ఉన్న పరిధిని దృష్టిలో పెట్టుకొని సిబ్బంది సంఖ్యను పెంచాలని మేము సైతం ప్రతిపాదనలు చేస్తున్నాం.



నూతన అగ్నిమాపక శకటం

వేధిస్తున్న సిబ్బంది కొరత

జిల్లా కేంద్రంగా మారిన కొత్తగూడెం ప్రాధాన్యం, మండలాల సంఖ్యను దృష్టిలో పెట్టుకుని సిబ్బంది సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉంది. శాఖలో కీలక పాత్ర పోషించే సిబ్బంది నియామకాలను రెండింతలు చేస్తూ ఉన్నతాధికారులు దృష్టి సారించాలనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుతం ఉన్న ఖాళీలను భర్తీ చేస్తూనే సిబ్బంది సంఖ్యను పెంచితే కొంత వరకు ఉపశమనం కలిగే ఆస్కారం ఉంది. ఆరు నెలల క్రితం అగ్నిమాపక కేంద్రాలకు 'మిస్ట్ బుల్లెట్స్'ను కేటాయించారు. ప్రతీ కేంద్రానికి రెండు బుల్లెట్ వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఒక్కో బుల్లెట్ రూ.5 లక్షలు వెచ్చించి అందుబాటులోకి తీసుకొచ్చినా సిబ్బంది కొరతతో వాటి వినియోగానికి సైతం నానా తంటాలు పడాల్సి వస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి శాఖలో సిబ్బంది సంఖ్యను పెంచి రెండు శకటాలు వినియోగంలోకి వచ్చేలా చూడటంతో చాలావరకు ప్రమాదాలను సత్వరంగా నివారించి ఆస్తినష్టం, ప్రాణనష్టం సంభవించకుండా జాగ్రత్తలు తీసుకునే వీలుంది.

'పైసా వసూల్' ఆడియో విడుదలను విజయవంతం చేయాలి

16న అభిమానుల ర్యాలీ

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఈనెల 17న బాలకృష్ణ నటించిన 101వ చిత్రం 'పైసా వసూల్' చలన చిత్ర ఆడియో విడుదలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు అభిమాన సంఘం రాష్ట్ర కన్వీనర్ శ్రీధర్, జిల్లా కన్వీనర్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 16 సాయంత్రం మూడు గంటలకు బాలయ్య అభిమానుల సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్టీఆర్ కూడలి నుంచి వైరా రోడ్డు, ఓవర్ బ్రిడ్జి, పీఎస్ఆర్‌రోడ్, బోస్ సెంటర్, ఆర్వోబీ, చర్చి కాంపౌండ్ మీదుగా సర్దార్ పటేల్ స్టేడియం వరకు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. నందమూరి అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో అభిమాన సంఘం నాయకులు సుబ్బారావు, రవికుమార్, కిరణ్ తేజ, రంజిత్, వేణు, పరుశరాం, ఏడుకొండలు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బాలయ్య అభిమానుల సంఘం రాష్ట్ర కన్వీనర్ శ్రీధర్, జిల్లా నాయకులు శ్రీనివాస్, రంజిత్, వేణు తదితరులు

జలపాతం వద్ద పర్యాటకుల కోలాహలం



వాజేడు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని బొగత జలపాతం సోమవారం పర్యాటకుల కోలాహలంతో సందడిగా మారింది. వరుస సెలవులు రావడంతో జలపాతాన్ని తిలకించేందుకు దూరప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో జలపాతం వద్దకు చేరుకుంటున్నారు. ఉవ్వెత్తున దూకుతున్న వరదనీటి ప్రవాహంలో పర్యాటకులు తడిసి ముద్దవుతున్నారు. జలపాతంలో స్నానాలు చేసేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. చిన్నారులు సైతం వరదనీటి పరవళ్లలో ఆటలాడుతున్నారు. వరద నీటిలో చిన్నారుల కేరింతలను కెమెరాలో చిత్రీకరించేందుకు తల్లిదండ్రులు ఉత్సాహం కనబరుస్తున్నారు. దట్టమైన అడవిలో కొండలపై నుంచి జలజలా రాలుతున్న వరదనీటి ప్రవాహం, జలపాతం అందాలను తిలకించి ముగ్ధులవుతున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రముఖ పర్యాటక కేంద్రం బొగత జలపాతంలో చేపట్టిన అభివృద్ధి పనులను అదనపు పీసీసీఎఫ్ మునీంద్ర సోమవారం పరిశీలించారు. పర్యాటకుల సౌకర్యార్థం చేపట్టిన పనులను పరిశీలించిన ఆయన పర్యాటకులు ప్రమాదాలకు గురి కాకుండా భద్రతా చర్యలను సమర్థవంతంగా చేపట్టాలని అటవీ అధికారులకు సూచించారు. ఇటీవల జరిగిన ప్రమాదాలలో మృతిచెందిన సంఘటనల వివరాలను అటవీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పర్యాటకులు వరద నీటిలోకి వెళ్లకుండా తీసుకుంటున్న జాగ్రత్తలను పరిశీలించిన ఆయన కంచె, రెయిలింగ్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

ఆహ్లాదాన్ని పొందండి.. హానికర పనులు చేయకండి

బొగత జలపాతం అందాలను తిలకించి ఆహ్లాదాన్ని పొందండి. ప్రాణాపాయం కలిగించే హానికరమైన పనులను చేయకండంటూ పర్యాటకులకు అదనపు పీసీసీఎఫ్ మునీంద్ర సూచించారు. జలపాతం సందర్శనలో భాగంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రకృతిలో ఏర్పడిన అందమైన జలపాతం పర్యాటకులకు కనువిందు చేసే విధంగా అభివృద్ధి పనులు చేపడతామని పేర్కొన్నారు. పర్యాటకులు ప్రమాదాలకు గురి కాకుండా రెయిలింగ్ ఏర్పాటు చేసి సందర్శకులకు ఆహ్లాదం కలిగించే విధంగా పనులు చేపడతామని చెప్పారు. ఆయన వెంట డీఎఫ్‌వో రవికిరణ్, ఎపీడీవో వజ్రా రెడ్డి, అటవీ క్షేత్రాధికారి శంకర్, ఎఫ్ఎస్వోలు నాగరాజు, లక్ష్మయ్య, ఎఫ్‌బీవో కేవల్‌రామ్ ఉన్నారు.



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న అదనపు పీసీసీఎఫ్ మునీంద్ర

ఆగస్టు 8: రాష్ట్రీయం

తెలుగు రాష్ట్రాల మధ్య బదిలీలకు అనుమతి

♦ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు అంతర్రాష్ట్ర బదిలీలకు అనుమతినిస్తూ, దీనికి సంబంధించిన మార్గదర్శకాలను జారీ చేశాయి. భార్యాభర్తల బదిలీలు, స్థానిక (జిల్లా, జోనల్, బహుళ జోనల్), కేంద్రం ఆమోదం పొందిన రాష్ట్ర స్థాయి కేటగిరీల్లో పరస్పర బదిలీలకు అనుమతి లభించింది. ప్రభుత్వ శాఖలతో పాటు స్థానిక సంస్థల ఉద్యోగులకు కూడా ఇవి వర్తిస్తాయి. తెలుగు రాష్ట్రాల విభజన సందర్భంగా కమలనాథన్ కమిటీ ఆధ్వర్యంలో ఉద్యోగుల విభజన జరిగింది. 58, 42 శాతం దామాషాలో కేటాయింపులు జరిపారు. వివిధ కారణాలతో చాలామంది ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి బదిలీలను కోరారు. దీనిపై గవర్నర్ నరసింహన్ నేతృత్వంలో రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం జరిగింది. ఇద్దరు సీఎంలు అంతర్రాష్ట్ర బదిలీలకు ఆమోదం తెలిపారు.

ప్రతిభ

‘సంకల్పం నుంచి సిద్ధి వరకు’ నినాదం ఎవరిది?

జాతీయం

ఆగస్టు 4

నావిక్‌కు భారత పరమాణు గడియారాలు

♦ సొంత జీపీఎస్ వ్యవస్థ (నావిక్)లో స్వదేశీకరణ దిశగా భారత్ కీలక ముందడుగు వేసింది. నావిక్‌కు భారత పరమాణు గడియారాల ద్వారానే సమయాన్ని అందించేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)కు చెందిన ఇస్ట్రాక్ సెల్, దిల్లీలోని నేషనల్ ఫిజికల్ ల్యాబొరేటరీ (ఎన్‌పీఎల్) మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం ఇస్రోకు అత్యంత కచ్చితమైన సమయాన్ని ఎన్‌పీఎల్ అందిస్తుంది. ఇది అందించే భారత ప్రామాణిక సమయానికి (ఐఎస్‌టీ) అనుగుణంగా ‘నావిక్’ సమన్వయమవుతుంది.

ఆగస్టు 7

అగర్తలాలో ఎల్‌పీజీ బాట్లింగ్ కర్మాగారం



♦ రూ. 143 కోట్లతో అగర్తలాలో నిర్మించనున్న ఎల్‌పీజీ బాట్లింగ్ కర్మాగారానికి కేంద్ర చమురు శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శంకుస్థాపన చేశారు. ఈశాన్య రాష్ట్రాలకు ఎదురవుతున్న వంట గ్యాస్ కొరతను అధిగమించడానికి చిట్టగాంగ్ నుంచి త్రిపుర వరకు సహజ వాయువు గొట్టపు మార్గాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. పశ్చిమ్ బంగలోని సిలిగురి నుంచి బంగ్లాదేశ్‌లోని పార్వతీపూర్ వరకు డీజిల్ చేరవేయడానికి గొట్టపు మార్గాన్ని నిర్మించనున్నట్లు చెప్పారు. గృహావసరాల కోసం పేదలు వినియోగించే కిరోసిన్, వంటగ్యాస్ సిలిండర్లపై రాయితీ కొనసాగుతుందని ధర్మేంద్ర ప్రధాన్ స్పష్టం చేశారు.

ఆగస్టు 8

అయోధ్యకు పరిష్కారం

♦ అయోధ్యలో వివాదాస్పద స్థలానికి సముచిత దూరంలో ముస్లింలు అధికంగా నివసించే ప్రాంతంలో మసీదును



నిరభ్యంతరంగా నిర్మించుకోవచ్చంటూ ఉత్తర్ ప్రదేశ్ షియా సెంట్రల్ వక్ఫ్‌బోర్డు సుప్రీంకోర్టుకు తన అభిప్రాయాన్ని సూచనప్రాయంగా తెలిపింది. ఈ వ్యవహారంలో వివిధ హిందూ సంస్థలు చేస్తోన్న డిమాండ్‌కు మద్దతుగా ముందుకొచ్చిన తొలి ముస్లిం సంస్థ యూపీ షియా బోర్డే అవుతుంది. అయితే అదే సమయంలో బాబ్రీ మసీదు స్థలం తమ సొంత ఆస్తి అని, ఈ వివాదానికి సామరస్యపూర్వక పరిష్కారానికి చర్చలు జరిపే హక్కు తమకు మాత్రమే ఉందని కూడా వక్ఫ్‌బోర్డు స్పష్టం చేసింది.

ఆగస్టు 9

క్విట్ ఇండియా ఉద్యమ 75వ వార్షికోత్సవం

♦ క్విట్ ఇండియా దినోత్సవ 75 వ వార్షికోత్సవాన్ని దేశ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ‘సంకల్పం నుంచి సిద్ధి వరకు’ అనే నినాదాన్ని ఇచ్చారు. పీడిస్తోన్న సమస్యల నుంచి దేశానికి విముక్తి కల్పించి, 2022 నాటికి సరికొత్త భారతావనిని తీర్చిదిద్దడానికి ప్రజలు ప్రతిజ్ఞ తీసుకోవాలని మోదీ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రూపొందించిన ఎనిమిది తపాలా బిళ్లలను రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఎట్‌హోం కార్యక్రమంలో విడుదల చేశారు.

గుజరాత్ రాజ్యసభ ఎన్నికలు

♦ గుజరాత్ నుంచి రాజ్యసభకు జరిగిన ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యాయి. భాజపా నుంచి బరిలో దిగిన జాతీయ అధ్యక్షుడు అమిత్ షా, కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ సునాయాసంగా గెలుపొందగా, మూడో అభ్యర్థి బల్వంత్ సింగ్ రాజ్‌పుత్ మాత్రం ఓటమి పాలయ్యారు. సోనియా గాంధీ రాజకీయ కార్యదర్శి అహ్మద్ పటేల్ వెంట్రుకవాసిలో ఓటమిని తప్పించుకుని విజయం సాధించారు. గెలవడానికి అవసరమైన 44 ఓట్లను దక్కించుకున్న పటేల్ అయిదోసారి రాజ్యసభకు ఎన్నికయ్యారు.

ఆగస్టు 10

హమీద్ అన్సారీ పదవీ విరమణ

♦ రెండు విడతల్లో పదేళ్లపాటు రాజ్యసభ ఛైర్మన్, ఉప రాష్ట్రపతి హోదాల్లో సేవలందించిన మహ్మద్ హమీద్ అన్సారీ పదవీ కాలం పూర్తయ్యింది. ఈ నేపథ్యంలో ఆయనకు రాజ్యసభ ఘనంగా వీడ్కోలు పలికింది.

పెరగనున్న కేంద్ర ప్రభుత్వ వ్యయం

♦ కేంద్ర ప్రభుత్వ వ్యయం 2019-20 ఆర్థిక సంవత్సరం నాటికి రూ. 26 లక్షల కోట్లకు చేరే అవకాశం ఉందని పార్లమెంటుకు సమర్పించిన ఆర్థికశాఖ అధికార పత్రం వెల్లడించింది. మూలధన వ్యయం 25% పెరిగి, ఆ ఆర్థిక సంవత్సరం నాటికి రూ. 3.9 లక్షల కోట్లకు చేరుతుందని, ఒక్క రక్షణ రంగ వ్యయమే 22% పెరుగుతుందని ఈ నివేదిక పేర్కొంది. రెవెన్యూ వ్యయంతో కలిపి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఖర్చు రూ. 21.46 లక్షల కోట్లుగా, వచ్చే ఏడాది రూ. 23.4 లక్షల కోట్లుగా ఉంటుందని తెలిపింది.

ఆగస్టు 11

వెంకయ్యా నాయుడు ప్రమాణ స్వీకారం

♦ దేశ 15 వ ఉపరాష్ట్రపతిగా (వ్యక్తుల పరంగా 13) తెలుగుబిడ్డ ముప్పవరపు వెంకయ్య నాయుడు ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లోని దర్బార్ హాల్‌లో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. వెంకయ్య భగవంతుడి పేరిట ప్రమాణం చేశారు.

♦ ఉపరాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం రాజ్యసభ అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టిన వెంకయ్య నాయుడు రాజ్యసభ కార్యకలాపాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులనుద్దేశించి స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు.

రాష్ట్రీయం - తెలంగాణ

ఆగస్టు 8

వయోపరిమితికి మరో రెండేళ్లు..

♦ పబ్లిక్ సర్వీస్ కమిషన్, ఇతర నియామక సంస్థల ద్వారా భర్తీ అయ్యే ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల గరిష్ఠ వయో పరిమితి పెంపుదలను మరో రెండేళ్లు అమలు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. సాధారణ నియామకాలకు మాత్రమే పెంపుదల వర్తిస్తుందని, పోలీసు, అబ్కారీ, అటవీ, అగ్నిమాపక, జైళ్ల శాఖల్లాంటి యూనిఫాం సర్వీసులకు వర్తించదని పేర్కొంది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత నిరుద్యోగుల వినతి మేరకు ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న 34 ఏళ్ల గరిష్ఠ వయోపరిమితిని 44 ఏళ్లకు పెంచుతూ 2017 జులై 27 న ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆ గడువు 2017 జులై 26 తో ముగిసిపోయింది. తాజాగా దీన్ని మరో రెండేళ్లపాటు అంటే 2019 జులై 26 వరకూ అమలు చేసేందుకు ఆదేశాలిచ్చింది.

ఆగస్టు 10

ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకానికి శంకుస్థాపన

♦ ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకానికి సంబంధించిన వరద కాలువ వద్ద ఏర్పాటు చేసిన పైలాన్‌ను ముఖ్యమంత్రి కేసీఆర్ ఆవిష్కరించారు. అనంతరం పోచంపాడు వద్ద గోదావరి ఒడ్డున ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. మేడిగడ్డ నుంచి తరలించే జలాలతో 45 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని ప్రకటించారు. ప్రధాన గోదావరిలో ఎగువ రాష్ట్రమైన మహారాష్ట్ర నుంచి చుక్కనీరు రాకపోయినా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, కాలువలు నిత్యం జలకళతో ఉట్టిపడేలా రూ. 2 వేల కోట్లతో ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

రాష్ట్రీయం - ఆంధ్రప్రదేశ్

♦ విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీకి (ఐఐపీఈ) జాతీయ ప్రాధాన్యత హోదా కల్పిస్తూ లోక్‌సభలో ప్రవేశపెట్టిన బిల్లు ఆమోదం పొందింది. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని 13 వ షెడ్యూల్‌లో పేర్కొన్న హామీ ప్రకారం కేంద్ర ప్రభుత్వం గతేడాది విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఐఐపీఈని ప్రారంభించింది. మిగతా జాతీయ విద్యా సంస్థల్లాగే డిగ్రీలు ప్రదానం చేసే స్వయం ప్రతిపత్తి కల్పించడానికి ఈ బిల్లును ఉద్దేశించారు.

ఆగస్టు 6

చిత్తూరు జిల్లాలో ఈ - క్లస్టర్

♦ చిత్తూరు జిల్లాలో 501 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్న ఎలక్ట్రానిక్ ఉపకరణాల తయారీ క్లస్టర్ (ఈ-క్లస్టర్)కు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ తుది అనుమతులు జారీచేసింది.

ఆగస్టు 8

విజయవాడలో విద్యుత్‌సౌధ ప్రారంభం

♦ విజయవాడలోని గుణదలలో నిర్మించిన విద్యుత్ సౌధ, ఆంధ్రప్రదేశ్ స్టేట్ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఏపీఎస్ఎల్‌డీసీ)ను సీఎం చంద్రబాబుతో కలిసి గవర్నర్ నరసింహన్ ప్రారంభించారు. సంతోషానికి చిహ్నంగా ఈ భవనాలకు ‘సమృద్ధి’ అనే పేరు పెట్టాలని గవర్నర్ సూచించారు.

ఆగస్టు 9

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

♦ ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా అరకులో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, గవర్నర్ నరసింహన్ పాల్గొన్నారు. రాష్ట్రంలో 34 తెగల్లో 27.39 లక్షల మంది గిరిజనులు ఉన్నారు. వీరి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రూ. 3,520 కోట్లు కేటాయించినట్లు సీఎం తెలిపారు.



రచయిత
- సీహెచ్. కృష్ణప్రసాద్
విషయ నిపుణులు

అంతర్జాతీయం

ఆగస్టు 6

ఉత్తర కొరియాపై ఆంక్షలు

♦ ఉత్తర కొరియాపై కఠిన ఆంక్షలను విధిస్తూ అమెరికా రూపొందించిన ఒక తీర్మానానికి ఐరాస భద్రతా మండలి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. దీనివల్ల ఉత్తర కొరియాకు ఏటా 100 కోట్ల డాలర్ల మేర ఆదాయాన్నిచ్చే ఎగుమతులపై నిషేధం అమలవుతుంది. అమెరికా అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టాక ఉత్తర కొరియాకు వ్యతిరేకంగా చేపట్టిన మొదటి చర్య ఇదే. దీనికి ఉత్తర కొరియా మిత్రపక్షం చైనా కూడా మద్దతు తెలపడం విశేషం.

ఆగస్టు 7

♦ వివాదాస్పద దక్షిణ చైనా సముద్రంలో చైనా కృత్రిమ దీవులను ఏర్పాటు చేయడం, వాటిపై నిర్మాణాలు చేపట్టడం, సైనికీకరణను అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా ఖండించాయి. మనీలాలో జరిగిన ఆసియాన్ విదేశాంగ మంత్రుల సదస్సు సందర్భంగా కొన్ని ఆసియాన్ దేశాలు దక్షిణ చైనా సముద్ర వివాదం విషయంలో చర్చలపై చైనా విధి విధానాలకు అంగీకారం తెలిపాయి. ఇలా చైనా పట్ల ఆసియాన్ వైఖరి మెత్తబడిన తరుణంలో ఈ మూడు దేశాలు ఈ మేరకు సంయుక్త ప్రకటన విడుదల చేశాయి.

ఆగస్టు 9

వీసా రహిత ప్రవేశాన్ని ప్రకటించిన ఖతార్

♦ భారత్‌తో సహా 80 దేశాల ప్రజలకు వీసా రహిత ప్రవేశానికి అనుమతి ఇస్తున్నట్లు ఖతార్ ప్రకటించింది. ఈ 80 దేశాల ప్రజలు ఖతార్ చేరుకున్న వెంటనే అక్కడికక్కడే పర్యటక వీసాలను మంజూరు చేస్తారు.

వార్తల్లో వ్యక్తులు

ఆగస్టు 5

నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్‌గా రాజీవ్ కుమార్



♦ నీతి ఆయోగ్ తదుపరి వైస్ ఛైర్మన్‌గా డాక్టర్ రాజీవ్ కుమార్‌ను నియమిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆక్స్‌ఫర్డ్‌లో ఆర్థిక శాస్త్రంలో డీఫిల్, లఖ్‌నవూ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ చేసిన రాజీవ్ కేంద్ర విధానాల పరిశోధన సంస్థలో సీనియర్ ఫెలోగా ఉన్నారు. గతంలో ఫిక్కీకి సెక్రటరీ జనరల్‌గా, భారతీయ అంతర్జాతీయ ఆర్థిక సంబంధాల పరిశోధన మండలికి చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేశారు.

ఆగస్టు 8

ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ దీపక్ మిశ్రా



♦ సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ దీపక్ మిశ్రా నియమితులయ్యారు. ప్రస్తుత భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేఎస్ ఖేహర్ ఈనెల 27 న పదవీ విరమణ చేస్తోన్న నేపథ్యంలో ఈ నియామకం జరిగింది. దీపక్ 1977 లో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. 1996 లో ఒడిశా హైకోర్టులో అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 1997 లో మధ్యప్రదేశ్ హైకోర్టుకు బదిలీ అయ్యారు. 2009 లో పట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, 2010 లో దిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. 2011 లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

IBPS - RRBs Recruitment

No. of Questions: 80 | Maximum Marks: 80 | Time: 45 Mts.

ప్రతిభ

IBPS Officers Prelims Model Paper - 2017

(నిన్నటి తరువాయి)

Directions (Q.31 - 35): Below is given a passage followed by several possible inferences which can be drawn from the facts stated in the passage. You have to examine each inference separately in the context of the passage and decide upon its degree of truth or falsity. Mark answer

1) If the inference is "definitely true" i.e. it properly follows from the statement of facts given.
2) If the inference is "probably true" though not "definitely true" in the light of the facts given.
3) If the data are inadequate i.e. from the facts given you cannot say whether the inference is likely to be true or false.
4) If the inference is "probably false" though not "definitely false" in the light of the facts given.
5) If the inference is "definitely false" i.e. it cannot possibly be drawn from the facts

Note: Each of the five questions has only one distinct answer i.e. no two questions can have the same answer. If you get same answer for more than one question, consider both again and decide which one of the two would more definitely be that answer and same way review other also.

The first time I saw The Wizard of Oz, the story bewitched me the second time I saw The Wizard of Oz, the special effects amazed me. The third time I saw The Wizard of Oz, the photography dazzled me. Have you ever seen a movie twice, three times? You notice subtleties and hear sounds you completely missed the first time around. It's the same on the phone. Be-cause your business conversations are more consequential than movies, you should listen to them two, may be three times. Often we have no clear idea of what really happened in our phone conversation until we hear it again. You'll find shadings more significant than the colour of Toto's collar - and more scarecrows than you imagined who 'haven't got a brain!' How do you listen to your important business conversations again? Simply legally and ethically tape record them. I call the technique of recording and analyzing your business conversations for subtleties Instant Replay.

31. The movie The Wizard of Oz' will help improve business conversation.

32. For most, if they watch a movie more than once, different aspects in different order, like special effects, photography, story, music etc. would impress in a better way.

33. The tips are given for understanding business conversation.

34. The advice is being given to the sales team.

35. The author watches most movies more than twice.

Directions (Q.36 - 40): In each of the questions/ set of questions below are given two statements followed by two conclusions numbered I and II. You have to assume everything in the statements to be true even if they seem to be at variance from commonly known facts and then decide which of the two given conclusions logically follows from the information given in the statement. Give answer

1) If only conclusion I follows.
2) If only conclusion II follows.
3) If either conclusion I or conclusion II follows.
4) If neither conclusion I nor conclusion II follows.
5) If both conclusions I and II follow.

36. Statements: Some pins are clips.
Some clips are pens.
Conclusions: I. Some pins are pens.
II. No pin is a pen.

(Q.37-39):
Statements: All D's are A's.
All A's are C's.

37. Conclusions: I. Some C's are D's.
II. Some A's are D's.

38. Conclusions: I. All D's are C's.
II. Some D's are not A's.

39. Conclusions: I. All A's are D's.
II. All C's are A's.

40. Statements: All doors are windows.
Some windows are clips.
Conclusions: I. Some clips are doors.
II. Some windows are doors.

Quantitative Aptitude

41. 8 men can complete a piece of work in 20 days. 8 women can complete the same work in 32 days. In how many days will 5 men and 8 women together complete the same work?
1) 16 days 2) 12 days 3) 14 days
4) 10 days 5) None of these

42. The area of a square is 1024 sq. cm. What is the respective ratio between the length and the breadth of a rectangle whose length is twice the side of the square and breadth is 12 cm. less than the side of the square?
1) 5 : 18 2) 16 : 7 3) 14 : 5
4) 32 : 5 5) None of these


43. The sum of five consecutive even numbers of set-A is 220. What is the sum of a different set of five consecutive numbers whose second lowest number is 37 less than **double** of the lowest number of set -A?
1) 223 2) 225 3) 235
4) 243 5) None of these

44. The bus fare for one person is Rs. 420 from Agra to Aligarh and train fare between the same places for one person is equal to threefourth the bus fare for two persons between the same places. What is the total fare paid by 2 persons travelling by bus and 4 persons travelling by train between the two places?
1) Rs. 3,360 2) Rs. 3,460 3) Rs. 3,440
4) Rs. 3,406 5) None of these

45. The respective ratio between the speeds of a car, a jeep and tractor is 3 : 5 : 2. The speed of the jeep is 250 percent of the speed of the tractor which covers 360 km in 12 hours. What is the average speed of car and jeep together?
1) 60 km/hr. 2) 75 km/hr. 3) 40 km/hr.
4) Cannot be determined
5) None of these

Directions (Q.46 - 50): Study the following bar-graph carefully and answer the following questions.

Earnings (in rupees) of three different persons on four different days



46. What is Gita's average earnings over all the days together?
1) Rs.285 2) Rs.290 3) Rs.320
4) Rs.310 5) Rs.315

47. What is the total amount earned by Rahul and Naveen together on Tuesday and Thursday together?
1) Rs.1,040 2) Rs.1,020 3) Rs.980
4) Rs.940 5) Rs.860

48. Gita donated her earnings of Wednesday to Naveen. What was Naveen's total earnings on Wednesday after Gita's donation?
1) Rs.520 2) Rs.550 3) Rs.540
4) Rs.560 5) Rs.620

49. What is the difference between Rahul's earnings on Monday and Gita's earnings on Tuesday?
1) Rs.40 2) Rs.20 3) Rs.50
4) Rs.30 5) Rs.10

50. What is the respective ratio between Naveen's earnings on Monday, Wednesday and Thursday?
1) 7 : 3 : 5 2) 8 : 6 : 5 3) 8 : 7 : 4
4) 9 : 5 : 4 5) 9 : 3 : 4

Directions (Q.51 - 55): Study the following table carefully to answer the questions that follow:

Monthly Rent (in Rs. thousands) at five different places in six different years

	Place				
Years	Churchgate	Dadar	Kandivali	Borivali	Virar
2005	5.3	3.8	1.5	2.7	1.1
2006	12.5	8.3	3.4	4.8	2.1
2007	16.7	11.7	5.5	6.6	1.8
2008	20.9	13.6	9.8	12.7	3.6
2009	25.8	14.5	11.5	14.1	5.5
2010	30.3	20.9	15.6	15.9	7.8

51. In which place the monthly rent did not increase consistently from year 2005 to 2010?
1) Churchgate 2) Dadar 3) Kandivali
4) Borivali 5) Virar

52. In which year at Churchgate, the monthly rent increased more than 100 percent from the previous year?
1) 2006 2) 2007 3) 2008
4) 2009 5) 2010

53. What was the difference between the monthly rent at Dadar in the year 2009 and Borivali in the year 2007?
1) Rs.7,600 2) Rs.7,900 3) Rs.8,100



4) Rs.8,600 5) None of these

54. Monthly rent at Kandivali in the year 2008 was approximately what percent of the total monthly rent at Virar over all the years together?
1) 30 2) 33 3) 38 4) 42 5) 45

55. Which city was most expensive in terms of rent?
1) Churchgate 2) Dadar 3) Kandivali
4) Borivali 5) Virar

Directions (Q.56 - 60): In the following questions two equations numbered I and II are given. You have to solve both the equations and - Give answer

1) If x > y 2) If x ≥ y
3) If x < y 4) If x ≤ y
5) If x = y or the relationship cannot be established

56. I. $5x^2 - 18x + 9 = 0$
II. $20y^2 - 13y + 2 = 0$.

57. I. $x^3 - 878 = 453$
II. $y^2 - 82 = 39$

58. I. $\frac{3}{\sqrt{x}} + \frac{4}{\sqrt{x}} = \sqrt{x}$ II. $y^3 - \frac{(7)^{7/2}}{\sqrt{y}} = 0$

59. I. $9x - 15.45 = 54.55 + 4x$
II. $\sqrt{y + 155} - \sqrt{36} = \sqrt{49}$

60. I. $x^2 + 11x + 30 = 0$ II. $y^2 + 7y + 12 = 0$

Directions (Q.61 - 65): What will come in place of the question mark (?) in the following number series?

61. 7 20 46 98 202 (?)
1) 420 2) 410 3) 310
4) 320 5) None of these

62. 210 209 213 186 202 (?)
1) 138 2) 77 3) 177
4) 327 5) None of these

63. 27 38 71 126 203 (?)
1) 212 2) 202 3) 301
4) 312 5) None of these

64. 435 354 282 219 165 (?)
1) 103 2) 112 3) 120
4) 130 5) None of these

65. 4 200 369 513 634 (?)
1) 788 2) 715 3) 734
4) 755 5) None of these

Key

31-5	38-1	45-1	52-1	59-5
32-4	39-4	46-2	53-2	60-3
33-1	40-2	47-4	54-5	61-2
34-2	41-1	48-3	55-1	62-2
35-3	42-5	49-1	56-1	63-5
36-3	43-5	50-5	57-2	64-3
37-5	44-1	51-5	58-5	65-3.

(మిగతా ప్రశ్నలు రేపటి పేజీల్లో)

దేశభక్తి ఉప్పొంగే ప్రదేశాలివి!



పంద్రాగస్టు అనగానే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన రోజని ఎవర్ని అడిగినా చెబుతారు. దాన్ని సాధించడానికి జరిగిన ఉద్యమాలు... పోరాటం సాగించిన నేతలు గుర్తొస్తారు. మరి ఆనాటి పోరాటాలు జరిగిన ప్రదేశాలు మీకు తెలుసా? ఆ ప్రదేశాలను తల్చుకుంటే చాలు అప్పటి ఉద్యమాలు గుర్తొచ్చి దేశభక్తి ఉప్పొంగుతుంది. అవే ఇవి!

బారక్‌పూర్, పశ్చిమ్‌బంగ

ప్రథమ స్వాతంత్ర్య సమరం మొదలైంది ఇక్కడి నుంచే. తన కమాండర్లపై మంగళ్ పాండే తిరుబాటు చేస్తున్నట్టు ప్రకటించడంతో 1857 సిపాయిల తిరుగుబాటు ప్రారంభమైంది. బ్రిటిష్ పాలకులపై దాదాపు రెండు వందల ఏళ్లపాటు సాగిన పోరాటానికి ఇదే తొలిమెట్టు.

ఝాన్సీ, ఉత్తర్ ప్రదేశ్



రాణి ఝాన్సీ లక్ష్మీ బాయికి చెందిన ఈ నగరంలో సిపాయిల తిరుగుబాటు మరో మలుపు తిరిగి పాలకులపై యుద్ధంగా మారడానికి వేదికైంది.

చంపారన్, బిహార్



గాంధీజీ తొలి విజయానికి వేదిక ఇది. బ్రిటిష్‌వారు ఆహార ధాన్యాలకు బదులు వాణిజ్యపంటల్ని పండించమని బలవంతం చేశారు. గాంధీజీ భారత దేశానికి తిరిగొచ్చాక ఈ అంశంపై వ్యతిరేకిస్తూ చంపారన్ సత్యాగ్రహం నిర్వహించారు. ఇలా అహింసా ఉద్యమం మొదలైంది.



జలియన్ వాలా బాగ్, పంజాబ్

తెల్ల దొరల దురాగతానికి నిదర్శనంగా నిలిచిన ప్రాంతమిది. ఏప్రిల్ 13, 1919లో బ్రిటిష్ సైనికులు డయ్యర్ ఆధ్వర్యంలో అమాయక ప్రజలపై కాల్పులు జరిపారు. ఈ దుర్ఘటనలో 379 మంది మరణించారు. 1200 మందికి పైగా గాయాల పాలయ్యారు.



చౌరీ చౌరా, ఉత్తర్ ప్రదేశ్

1922లో సహాయ నిరాకరణ ఉద్యమం ఉధృతంగా జరుగుతున్నప్పుడు ఈ ప్రాంతం వార్తల్లోకెక్కింది. పోలీసుల దౌర్జన్యాలపై ఆగ్రహించిన ప్రజలు చౌరీ చౌరా పోలీస్ స్టేషన్ని దహనం చేశారు. కొంతమంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారు. దీంతో గాంధీజీ ఆ ఉద్యమాన్ని నిలిపివేశారు.

కాకోరి, ఉత్తర్ ప్రదేశ్



ఉద్యమాల కోసం డబ్బు అవసరమయ్యింది. దీంతో 1925 ఆగస్టు 9న బ్రిటిష్ ప్రభుత్వం రవాణా చేస్తున్న నిధి నుంచి ఉద్యమకారులు ఎనిమిది వేల రూపాయల్ని లూటీ చేశారు. ఈ సంఘటన ప్రభుత్వాన్ని కలవరపెట్టింది. చరిత్రలో బ్రిటిష్‌వారి సంపద లూటీ జరగడం ఇదే ప్రథమం.

దండి, గుజరాత్



స్వాతంత్ర్య సమరంలో ముఖ్య ఘట్టమైన ఉప్పు సత్యాగ్రహం జరిగింది ఇక్కడే. 1930లో ఉప్పుపై పన్ను పెంచినందుకు నిరసనగా దాన్ని ప్రభుత్వ వ్యతిరేకతకు సాధనంగా గాంధీజీ ఈ ఉద్యమాన్ని నిర్వహించారు. భారత స్వాతంత్ర్య పోరాటంపై బ్రిటిష్ వారి దృక్పథం మారడానికి ఇది ఎంతో దోహద పడింది.

చీరాల - పేరాల, ఆంధ్రప్రదేశ్

స్వాతంత్ర్యోద్యమంలో తెలుగు వారి పోరాట పటిమకు చీరాల - పేరాల కేంద్రంగా నిలిచాయి. స్వాతంత్ర్య సమరయోధుడు దుగ్గిరాల గోపాల కృష్ణయ్య ఆధ్వర్యంలో జరిగిందిది. అసలు ఉద్యమం ఎలా వచ్చిందంటే... 1919లో బ్రిటిష్ ప్రభుత్వం (గతంలో గుంటూరు జిల్లా) ప్రకాశం జిల్లాలోని చీరాల-పేరాల గ్రామాలను కలిపి పురపాలక సంఘంగా చేయడంతో ప్రజలపై పన్నుల భారం అధికమైంది. ఈ రెండు గ్రామాల్లోని



15,000 జనాభా ఆదాయం నాలుగు వేల రూపాయలు. కానీ బ్రిటిష్‌వారు పన్నుల పేరుతో నలభైవేల రూపాయలు లాక్కునే ప్రయత్నాలు చేశారు. దీన్ని వ్యతిరేకిస్తూ పురపాలక సంఘం రద్దు చేయాలని ప్రజలంతా ఉద్యమించారు. దుగ్గిరాల గోపాలకృష్ణయ్య నాయకత్వంలో ఆందోళన మొదలుపెట్టారు. వేయి మంది సభ్యులతో 'రామదండు' అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశారు. విజయవాడ కాంగ్రెస్ సమావేశాల సందర్భంగా గాంధీజీ వచ్చినప్పుడు సమస్యను ఆయనకు వివరించారు. మహాత్ముడు చీరాలను సందర్శించి ఊరు ఖాళీ చేస్తే మున్సిపాలిటీ దానంతట అదే రద్దవుతుందనే సూచన ఇచ్చారు. దీంతో ఆ రెండు గ్రామాల ప్రజలు ఊరు వదిలేసి పక్కనే ఉన్న ప్రదేశంలో 'రామ్‌నగర్' పేరుతో కొత్త నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. 11నెలల పాటు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ ఉద్యమాన్ని కొనసాగించారు.

హాయ్! బుజ్జీ!!

ఎప్పుడూ నిజం మాట్లాడితే కష్టాల్లో అందరూ మనకు తోడుగా ఉంటారు
– గాంధీజీ

పదసంపద!

రోజుకు రెండు పదాలు చదివితే పదసంపద మీదే!

- Pull = లాగు
- అపరాధం = తప్పు

నవ్వుల జల్లులు!

వనజ: దుస్తులుతకవే అంటే ఇంటికి తీసుకెళతానంటావేంటి?

పనిమనిషి: ఇప్పుడివి ఉతికే ఓపిక లేదమ్మా. మా ఇంట్లో వాషింగ్ మెషీన్‌లో వేసి తెస్తా!

- పీవీ రమణకుమార్, చిలకలూరిపేట



బాజీ రౌత్ కథ విన్నారా?

అతనెవరా? చిన్నవయసులోనే ప్రాణాలను సైతం లెక్కచేయక బ్రిటిష్ వాళ్లను ఎదిరించాడు. స్వాతంత్ర్యం కోసం అతను చేసిన త్యాగానికిగానూ తన పేరుతో పురస్కారాలూ ఇస్తున్నారు. ఇంకా బోలెడు కబుర్లున్నాయ్...

బాలభారతం ఆగస్టు సంచికలో

bb@ramojifoundation.org
Cell: 80085 51844

చిలిపి ప్రశ్న

నింగీ నేలా కలిసేదెప్పుడు?

- కృష్ణవేణి, విశాఖపట్నం

ఏమిటిది?

పదాల అమరికను బట్టి వచ్చే పదబంధాన్ని కనిపెట్టగలరా?



బొమ్మల్లో ఏముంది?

బొమ్మల ఆంగ్ల పేర్లు గడుల్లో రాసి రంగు గడుల్లోని అక్షరాల్ని వరుసగా చదివితే ఓ సందేశం వస్తుంది.

8 

1 

9 

2 

10 

3 

11 

4 

12 


5 

13 

6 

14 

7 

15 

జవాబులు: బొమ్మల్లో ఏముంది: 1. Bird 2. Nose 3. Dove 4. Bear 5. Jeep 6. Cave 7. Corn 8. Door 9. Tree 10. Neck 11.Cart 12. Gems 13. Hand 14. Ball 15. Yawn వచ్చే సందేశం: INDEPENDENCE DAY చిలిపిప్రశ్న: కలల్లో! ఏమిటిది: Get up and go

జిల్లాకు రెండు 'హరిత మిత్ర' అవార్డులు

నేడు కలెక్టర్ చేతుల మీదుగా అందజేత

కొత్తగూడెం సంక్షేమ విభాగం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న 'హరిత మిత్ర' అవార్డులు జిల్లాల్లో ఇద్దరిని వరించాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'తెలంగాణకు హరితహారం' కార్యక్రమంలో గతేడాది వరకు విశిష్ట సేవలు అందించిన వారికి ఈ అవార్డులను అందించనుంది. ఎంపికైన వారి పేర్లను ఈ నెల 11న అవార్డు కమిటీ ఛైర్మన్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీపీ ఆచార్య ప్రకటించారు. ప్రభుత్వ రంగ సంస్థలు, ఉద్యోగులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక స్వపరిపాలన సంస్థలు, ప్రభుత్వేతర సంస్థలు, కార్పొరేట్ సంస్థలు.. ఇలా క్యాటగిరిల వారీగా ఎంపిక చేశారు. నేడు ఈ అవార్డులను జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ ఎంపికైన వారికి అందిస్తారు.

రామ్‌సింగ్ పనితో పాటు ఆటల్లోనూ..


జిల్లా స్థాయి హరిత మిత్ర అవార్డుకు ఎంపికైన ఇల్లెందు డివిజన్‌కు చెందిన ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ గుగులోత్ రామ్‌సింగ్ పనితో పాటు ఆటల్లోనూ దిట్ట. 2007 నుంచి ఆయన ఈ డివిజన్‌లో పని చేస్తున్నారు. హరితహారం కార్యక్రమంలో



రామ్‌సింగ్


ఆ డివిజన్‌లో ప్రధాన భూమిక పోషించారు. కొమరారం రేంజీ పరిధిలో పని చేసే రామ్‌సింగ్ 2015లో 100 హెక్టార్లు, 2016లో 150 హెక్టార్ల పోడు భూముల్లో మొక్కలు నాటించడంలో విజయం సాధించారు. ఈ ఏడాది సైతం 100 హెక్టార్లలో మొక్కలు నాటించారు. అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 2015 బ్యాడ్మింటన్‌లో బంగారు పతకం, 2016లో రజతం, 2017లో రాష్ట్ర స్థాయిలో బంగారు, జోనల్ స్థాయిలో బంగారు పతకాలు సాధించారు.

హరితహారంలో సీఐ ముఖ్యభూమిక



పోడు భూముల్లో హరితహారం నిర్వహించే సమయంలో ఎదురైన సమస్యలను దీటుగా ఎదుర్కొన్న గుండాల **సీఐ టి.రవి** జనరల్ కేటగిరిలో జిల్లా స్థాయి 'హరిత మిత్ర' అవార్డుకు ఎంపికయ్యారు. రవి 2014 డిసెంబరు నుంచి గుండాల సర్కిల్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఆయన విధుల్లో చేరిన ఆరేడు నెలల వ్యవధిలోనే హరితహారం-1 నిర్వహించాల్సి వచ్చింది. అయినా పోడు భూముల సేకరణకు గిరిజనులను సామరస్య పద్ధతిలో ఒప్పించేందుకు మంచి కృషి చేశారు. ఏజెన్సీ ప్రాంతమైనప్పటికీ గిరిజనులకు అవగాహన కల్పించి హరితహారం సజావుగా సాగేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నందుకు ఆయనకు ఈ అవార్డుకు దక్కింది.

ఉత్తమ ఎన్ఎస్ఎస్ అధికారిగా మల్లేశం



కొత్తగూడెం విద్యావిభాగం, న్యూస్‌టుడే: జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్)లో అందించిన సేవలకు గాను కాకతీయ యూనివర్సిటీ స్థాయిలో ఉత్తమ ప్రోగ్రాం అధికారిగా కొత్తగూడెం వివేవకర్ధని కళాశాలకు చెందిన ఆకుల మల్లేశం ఎంపికయ్యారు. గత మూడేళ్లుగా వివిధ సేవా కార్యక్రమాల్లో విద్యార్థులతో కలిసి అందించిన ఉత్తమ సేవలను గుర్తిస్తూ అవార్డుకు ఎంపిక చేసినట్లు కేయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం సమన్వయకర్త డా.జ్యోతి ప్రకటించారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ ఎంవీ.చౌదరి, సీఈవో చైతన్యకృష్ణ ఆయన్ని అభినందించారు. మల్లేశంతో పాటు భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన అధ్యాపకుడు పి.ఆనంద్‌బాబు కూడా ఉత్తమ ప్రోగ్రాం అధికారిగా ఎంపికయ్యారు.

ఈటీవీలో ఈనాడు

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈటీవీ ప్రత్యేక కార్యక్రమాలు

ఉదయం

05-45: ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: కుజ, రాహు, కేతు గ్రహాలు అనుకూలించాలంటే... మంగళవారంరోజు ఏం చేయాలి?, ఆరోగ్యసిద్ధికి వాస్తురీత్యా ఏం చేయాలి?, 08-30: టాలీవుడ్ టైమ్: 09-00: స్పెషల్ ఈనాడు సినిమా: సర్దార్ పాపారాయుడు (ఎన్టీఆర్, శ్రీదేవి, శారద).

మధ్యాహ్నం

12-00: స్పెషల్ అభి'రుచి': సింగర్ దినకర్ అతిథిగా ఘుమఘుమలు 'కొబ్బరి క్యారెట్ పలావు', మీచేతివంట 'చాక్లెట్ కాఫీ', 'డ్రైఫ్రూట్ కస్టర్డ్ బిస్కెట్స్', జస్ట్ ఏ మినిట్ 'బేబీకార్న్ శాండ్‌విచ్' తయారుచేసే విధానం, ఇంటింటి వంటింటి చిట్కాలు, 01-00: స్పెషల్ స్టార్ మహిళ: (మెగా గేమ్ షో) చైల్డ్ ఆర్టిస్ట్స్ స్పెషల్ ఎపిసోడ్..., 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి-2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00: వసంతం (డైలీ సీరియల్), 04-30: జబర్దస్త్ (రిపీట్), 05-30: జబర్దస్త్ జల్సా టైం (రిపీట్), 06-00: శ్రీ భాగవతం (భక్తి రసాత్మక దృశ్య కావ్యం), (డైలీ సీరియల్), 06-30: ఒకరికి ఒకరు (డైలీ సీరియల్)

రాత్రి

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతిచినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: వీర – చిన్నారుల టాలెంట్ షో..., 10-30: 'ఫన్' డే (స్పెషల్ కామెడీ ప్రోగ్రాం).

ఈటీవీ ప్లస్

ఉదయం 11:00 కిక్ రిపీట్
మధ్యాహ్నం 12:00 జబర్దస్త్ రిమిక్స్
01:00 అమ్మాయి క్యూటు అబ్బాయి నాటు రిపీట్
01:15 టాప్స్ రిపీట్
01:30 పటాస్ రిపీట్
02:00 అల్లరే అల్లరి రిపీట్
02:30 సరదాగా కాసేపు
03:00 తారక్ మామా అయ్యో రామ రిపీట్
03:30 సినిమా చూపిస్త మావ రిపీట్
సాయంత్రం
04:30 నా షో నా ఇష్టం
05:00 జిల్ జిల్ జిగా
06:00 అమృతం రిపీట్
06:30 ఎక్స్‌ప్రెస్ రాజా
రాత్రి
07:30 తారక్ మామా అయ్యోరామ
08:00 హంగామా
09:00 పటాస్
09:30 అల్లరే అల్లరి
10:00 సరదాగా కాసేపు
10:30 తారక్ మామా అయ్యోరామ రిపీట్
11:00 పటాస్ రిపీట్
11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

★ మానస (ఉ.6:00, సా. 6.00, రా. 11.00)
★ డా. ఈటీవీ (ఉ. 6:30, 11:00, మ. 3:30. రా. 7:30)
★ యోగమంత్ర (ఉ.7:00, సా.5:30, రా. 10:30, 11:30)
★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ. 7:30, సా. 5:00, రా. 10:30)
★ అమృతం (ఉ.8:00, మ. 12:30, రా. 8:00)
★ హెల్దీ & టేస్టీ – (ఉ.8:30, మ. 01:00, రా. 8:30)
★ ఆరోగ్యమస్తు (ఉ.09:00, 10:30, మ. 3:00, సా. 4:00, రా. 09:00)
★ జీవనరేఖ – విమెన్స్ హెల్త్ (ఉ. 9:30, మ. 2:00, రా. 7:00)
★ బాడీ మైండ్ & సోల్– అంతరంగం (ఉ. 10:00, మ. 2:30, రా. 9:30)
★ విహారి (మ. 12:00, సా. 6:30, రా. 10:00)
★ హెల్దీ డయాబెటిక్ (మ. 1:30)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: మధురిమలు, 7-00: సన్‌రైజ్ సినిమా: ధర్మయుద్ధం (రజనీకాంత్, శ్రీదేవి), 10-00: మార్నింగ్ షో: ప్రమీలార్జునీయం (ఎన్టీఆర్, బి.సరోజ), మధ్యాహ్నం: 1-00: మాట్నీ: చిత్రం భళారే విచిత్రం (నరేశ్, రాజీవి), సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: ఐ లవ్ ఇండియా (శరత్‌కుమార్, ప్రియారామన్), రాత్రి: 7-00: ఫస్ట్‌షో: రాజసింహ (కాంతారావు, వాణిశ్రీ), 10-00: మై ఛాయిస్ (స్పెషల్ ప్రోగ్రాం).

ఈటీవీ అభిరుచి

ఇండిపెండెన్స్ డే స్పెషల్స్

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - ట్రై కలర్ కేసరి, స్వీట్ కార్న్ అండ్ క్యారట్ రైస్, ఉ.8.00, రా.9:00: బ్రేక్ ఫాస్ట్ షో – ఫ్రూట్ అండ్ నట్ ప్యాస్ కేక్, ట్రై కలర్ స్వీట్ బేసిల్ దోస (ఇన్‌స్పెక్టర్ మాధవిలత), ఉ.10.00: ఆహారవీధిలో – ఫ్రోజెన్ డెసెర్ట్ - ఎన్.యమ్.రాజేశ్వరీ - ఫౌండర్ ఆఫ్ "తోడు నీడ" ఆర్గనైజేషన్, ఉ.11.00, రా.10.45: గోరు ముద్దలు – తిరంగా ప్యూరీ, ఉ.11.15, రా.8:30: డైట్ మెనూ – జండా దోశ శశికళ స్వామి సోషల్ వర్కర్, ఉ.11.30, రా.8:00: బాబాయ్ హోటల్ - బాదుషా, సింగర్ సాహితి, మ.12.00: టేస్ట్ ఆఫ్ ఇండియా - ట్రై కలర్ పేడ - సీఐ ధనలక్ష్మి, మ.12.15, రా.10:15: మమ్మీస్ కిచెన్ – తిరంగా ఇడ్లీ - సింగర్ ధనుంజయ్, మ.12.30, రా.8.45: సూపర్ చెఫ్ - సపోటా లడ్డు, మ.12.45: సూప్స్ & స్టార్టర్స్ - ట్రై కలర్ పనీర్ టిక్కా, మ.1.00: వావ్ ఏమి రుచి (స్క్వేర్స్ స్పెషల్) – తిరంగ్ పన్నీర్ స్క్వేర్స్, మ.1.30, రా.10.00: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) - తిరంగా కోకోనట్ స్వీట్ - జ్ఞానప్రసూన - సోషల్ వర్కర్, మ.1.45: ట్రెండీ ట్రీట్స్ – ట్రై కలర్ బిస్కెట్స్, మ.2.15: డిజైనర్ డిష్ – గిల ఫిలదోస్ - సిఐడి ఆఫీసర్ - ఉషశ్రీ, మ.2.30: చోటా చెఫ్ – ట్రై కలర్ ఖీర్.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360⁰, 08-30 యువ (రిపీట్), 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ (రిపీట్), 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్ (రిపీట్), 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్), **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360⁰, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: శ్రీ **రాధారాస్ బిహారీజీ మందిరం, జుహులా, ముంబాయి,** 5-00 ఘంటారావం, 05-30 అంతర్యామి (రిపీట్), 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360⁰, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్)

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రిపీట్), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360⁰, 08-30 యువ (రిపీట్), 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్ (రిపీట్),10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ (రిపీట్), 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్), **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360⁰, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థయాత్ర: శ్రీ **రాధాగోవింద్‌జీ మందిరం, జైపూర్, రాజస్థాన్,** **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి (రిపీట్), 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360⁰, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్).

ఏ ఛానల్లో ఏముంది.. 15-08-2017

SVBC: **ఉదయం:** 05-30 సుప్రభాత వైభవం, 06-30 శుభోదయం + నిత్య పూజలివిగో, 07-00 ఇండిపెండెన్స్ డే సెలబ్రేషన్స్ - టీటీడీ విష్ణుసహస్రనామ స్తోత్రం, 07-30 లైవ్ ఇండిపెండెన్స్ డే సెలబ్రేషన్స్ - టీటీడీ - శ్రీవారి సేవలు(అష్టాదళ పాద పద్మారాధన సేవ), 08-00 శతమానంభవతి, 08-30 శ్రీకృష్ణ పూజాఫలం, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 రా..రా.. కృష్ణయ్య, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు - కన్నడ, 10-30 లైవ్ పద్మావతి అమ్మవారి కల్యాణం - తిరుచానూరు, 11-30 ప్రత్యేక వార్తలు + ఆముక్తమాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణు సహస్ర నామామృతం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 కృష్ణం వందే జగద్గురు -శ్రీ మైలవరపు శ్రీనివాసరావు, 03-30 మురళీరవం, **సాయంత్రం:** 04-00 శ్రీదేవీ కటాక్షం, 04-30 మంగళగౌరివ్రత వైశిష్ట్యం - వద్దిపర్తి పద్మాకర్, 05-00 లైవ్ ఎస్.డి.సేవ - తిరుమల + ప్రత్యేక వార్తలు, అళ్వార్ శ్రీసూక్తి, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 శ్రీకృష్ణాలీలామృతం, 08-00 భక్తి చైతన్యం, 08-30 శ్రీకృష్ణావతారం - చాగంటి, 09-00 శ్రీకృష్ణక్షేత్రం -ఉడిపి 09-30 శ్రీ క్రిష్ణతత్వం - శ్రీ సామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 గోకులాష్టమి.

భక్తి TV: **ఉదయం:** 06-00 ద్వారక జన్మాష్టమి (లైవ్), 07-00 అర్చన, 07-30 జయకృష్ణముకుందా మురారీ, 08-00 పుణ్యక్షేత్రం, 08-30 శ్రీకృష్ణ శృంగార హారతి (లైవ్), 09-00 భజరే నందబాలం (లైవ్), 11.00 శ్రీకృష్ణహారతి (లైవ్), **సాయంత్రం:** 04-30 పుణ్యక్షేత్రం, 05-00 తారంగం..తారంగం, 05-30 జయకృష్ణముకుందామురారీ, 06-00 శ్రీలలితాసహస్రం, **రాత్రి:** 07-00 భక్తివిశేషాలు, 07-30 హరేకృష్ణ (లైవ్), 08-00 జన్మాష్టమి మహోత్సవం (లైవ్), 09-00 భజరే నందబాలం, 09-30 బృందావనం, 10-00 జన్మాష్టమి వైభవం, 11-30 మధురాభిషేకం (లైవ్).

జీ తెలుగు: **ఉదయం:** 07-00 టెలీషాపింగ్, 07-30 ఓంకారం, 08-00 సినిమా: లౌక్యం, 11-00 కామెడి ఖిలాడీలు రిపీట్, **మధ్యాహ్నం:** 12-00 గోల్డ్ రష్, 01-00 బతుకు జట్కా బండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం (రిపీట్), 03-30 వారెవా, **సాయంత్రం:** 04-00 కామెడి ఖిలాడీలు, 05-00 జై కృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమ భాగ్య, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 రామా సీతా.., **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్ద మందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మి, 08-30 పున్నాగ, 09-00 కళ్యాణ వైభోగం, 09-30 ముత్యాల ముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 ఇన్‌స్పెక్టర్ కిరణ్, 11-00 సినిమా: తడాఖా.

మా: **ఉదయం:** 07-00 మహాభారతం, 08-00రాశి ఫలాలు, 08-30 ఫన్ టైమ్, 09-00 సినిమా: ఎమ్.ఎస్.ధోని, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కొడుకు పెళ్లామా, 12-30 చిన్నారి పెళ్లికూతురు, 01-00 సంసారం ఒక చదరంగం, 02-00 కుంకుమ పువ్వు, 02-30 బిగ్ బాస్ రిపీట్, **సాయంత్రం:** 04-00 సినిమా: మర్యాద రామన్న, 05-30 ఒకే జాను, 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 చిన్నారి పెళ్లికూతురు, **రాత్రి:** 07-00 లక్ష్మీకళ్యాణం, 07-30 అష్టాచమ్మా, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమపువ్వు, 09-00 మల్లీశ్వరి, 09-30 బిగ్ బాస్, 10-30 బిగ్ బాస్ రిపీట్.

జెమిని: **ఉదయం:** 06-00 టెలి షాపింగ్ 07-00 సకలసిద్ధి, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం రిపీట్, 08-30 నాటు వైద్యం, 09-00 సినిమా: కృష్ణగాడి వీర ప్రేమగాథ, 12-00 నువ్వు నాకు నచ్చావ్ (రిపీట్), 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి 02-30 నాగిని 2 రిపీట్, 03-00 సినిమా: లయన్, 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 నాగిని 2, 08-00 నువ్వు నాకు నచ్చావ్, 08-30 శనీశ్వరుని దివ్య చరిత్ర, 09-00 నందిని, 09-30 అగ్నిపూలు, 10-00 సినిమా: ఊపిరి.

HBO: **ఉదయం:** 06-00 బ్లాక్ రెయిన్, 08-05 ది గాడ్‌ఫాదర్, 08-23 రష్ అవర్ 2, 10-03 టీనేజ్ మ్యూటంట్ నింజా టర్‌టిల్స్ : అవుట్ ఆఫ్ ది షాడోస్, **మధ్యాహ్నం:** 12-00 ట్రిపుల్ ఎక్స్, 02-08 బ్యాట్‌మ్యాన్ వర్సెస్ సూపర్‌మ్యాన్ : డాన్ ఆఫ్ జస్టిస్, **సాయంత్రం:** 04-49 సూసైడ్ స్క్వాడ్, 06-55 జాక్ రీచర్ : నెవర్ గో బ్యాక్, **రాత్రి:** 09-00 ఐరన్ మ్యాన్, 11-15 ది ట్రాన్స్‌పోర్టర్ రీఫ్యూల్డ్.

పొద్దుతిరుగుడులో తెగుళ్ల యాజమాన్యం

రైతేరాజు

పొద్దుతిరుగుడు పంటను ఆశించే తెగుళ్లు, యాజమాన్య పద్ధతులను నర్సంపేట వ్యవసాయ సహాయ సంచాలకులు తోట శ్రీనివాసరావు వివరించారు.

నెక్రోసిస్ తెగులు: ఈ తెగులు పంటను అన్ని కాలాల్లో ఏ దశలోనైన ఆశిస్తుంది. ఇది వైరస్ వల్ల వచ్చే తెగులు, తామరపురుగుల ద్వారా వ్యాప్తి చెందుతుంది. తెగులు సోకినప్పుడు ఆకుల మధ్య ఈనె దగ్గరగా ఉండే భాగం నల్లగా మారి, మాడిపోయి ఆకులు వంకరలు తిరిగి ఎండిపోతాయి. తెగులు ఆకు కాడకు, కాండానికి, పువ్వుకు వ్యాపించటం వలన ఆయా భాగాలు నల్లగా మాడి ఎండిపోతాయి. మొక్క సరిగా ఎదగక గిడసబారి పోతుంది. పుష్పం సరిగా విచ్చుకోక మెలి తిరుగుతుంది. పుష్పభాగం దెబ్బతిని విత్తన వృద్ధి జరుగదు. దిగుబడి తగ్గుతుంది.

యాజమాన్యం: వేసవి దుక్కులు చేయాలి. పంట చుట్టు నాలుగు సాళ్లు జొన్న, సజ్జ, మొక్కజొన్న పంటలు వేయాలి. కిలో విత్తనానికి 5 గ్రా. ఇమిడాక్లోప్రిడ్‌తో విత్తనశుద్ధి చేసి, తొలిదశలో తామరపురుగు ఆశించకుండా నివారించవచ్చు. పొలంగట్ల మీద వయ్యారిభామ కలుపు మొక్కలను, పొలంలో తెగులు సోకిన పంట మొక్కలను పూత రాక ముందే పీకివేసి కాల్చివేయాలి. లీటరు నీటికి మెటాసిస్టాక్స్ 2 మి.లీ. లేదా 15 లీటర్ల నీటికి ఇమిడాక్లోప్రిడ్ 6 మి.లీ. కలిపి 15 రోజులకోసారి 3 లేదా 4 సార్లు పిచికారి చేయాలి.

ఆకుమచ్చ తెగులు: పొద్దుతిరుగుడు సాగు చేసిన 50-60 రోజుల వరకు ఈ తెగులు ఆశిస్తుంది. ముదురు గోదుమ, నల్లటి, గుండ్రని లేదా అండాకారపు మచ్చలు మొదట ఆకులపై ఏర్పడి తేమ ఎక్కువగా ఉన్నప్పుడు ఈ మచ్చలు ఒకదానితో ఒకటి కలిసిపోయి ఆకు అంతా వ్యాపించి ఆకులు ఎండి రాలిపోతాయి. ఈ తెగులు లక్షణాలు ఆకుల పైనే కాకుండ పత్రవృత్తం, కాండం, పువ్వు వెనుక ఉండే ఆకుపచ్చని భాగాలపై ముదురుగోదుమ లేదా నలుపు రంగు మచ్చల వలె కన్పిస్తాయి. తెగులు సోకిన పుష్పాలు కుళ్లిపోయే అవకాశం ఉంది. అందువల్ల గింజ నాణ్యత తగ్గి మొలకశాతం



తగ్గుతుంది.

యాజమాన్యం: కిలో విత్తనానికి 2 గ్రా. ఇప్రోడైన్+కార్బండిజమ్ కలిపి విత్తనశుద్ధి చేయాలి. పంటపై తొలిదశలో వ్యాధిని గుర్తించిన వెంటనే లీటరు నీటికి 2 గ్రా. ఇప్రోడియన్+కార్బండిజమ్ లేదా 1 మి.లీ. ప్రొపికొనజోల్ కలిపి 15 వ్యవధితో 2 సార్లు పిచికారి చేయాలి.

బూడిద తెగులు: ఆకుల పైన అడుగుభాగాన బూడిద లాంటి పొడితో కప్పబడిన చిన్న మచ్చలు ఏర్పడి క్రమేపి ఆకు అంతా బూడిద లాంటి పొడితో కప్పబడి ఉంటుంది. తెగులు తీవ్రత ఎక్కువైతే ఆకులు పసుపురంగులోకి మారి రాలిపోతాయి.

యాజమాన్యం: లీటరు నీటికి 3 గ్రా. నీటిలో కరిగే గంధకం పొడి లేదా 1 మి.లీ. డైనోక్యాప్ కలిపి పిచికారి చేయాలి.

తుప్పు తెగులు: చలికాలంలో ఈ తెగులు తీవ్రత అధికంగా ఉంటుంది. ఈ తెగులు మొదట కింది ఆకులపై చిన్న ఇటుక వర్ణపు పొక్కులుగా ఏర్పడి క్రమేపి పైఆకులకు, పుష్పంలోని పచ్చని భాగాలకు వ్యాపిస్తుంది. తెగులు తీవ్రత ఎక్కువైనప్పుడు వ్యాధి సోకిన భాగాలు తుప్పు వర్ణం లోకి మారి ఎండిపోతాయి.

యాజమాన్యం: థైరామ్ లేదా కాప్టాన్ 3 గ్రా. కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేయాలి. మ్యాంకోజెబ్ 3 గ్రా. లేదా 2 గ్రా. జైనెబ్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

తలకుళ్లు లేదా పువ్వుకుళ్లు: ఈ తెగులు ఎక్కువగా పూతదశలో వర్షాలు పడినప్పుడు ఆశిస్తుంది. తెగులు సోకిన పువ్వు కింది భాగం నీటిలో తడిసినట్లుండి తరువాత గోదుమరంగుకు మారుతుంది. ఈ భాగంపై దూదిపింజ లాంటి శిలీంధ్రం పెరుగుతుంది. ఇది పువ్వు అంతా వ్యాపించి పువ్వు కుళ్లిపోయి గింజలు నల్లటి పొడి ముద్దగా మారతాయి.

యాజమాన్యం: లీటరు నీటికి మెటలాక్సిల్ 1 గ్రా.+ నీటిలో కరిగే గంధకం 3 గ్రా. కలిపి 10 రోజుల వ్యవధితో రెండుసార్లు పిచికారి చేయాలి.


బూజుతెగులు: ఈ తెగులు సోకిన ఆకులు ఈనెల మధ్య పత్రహరితం కోల్పోయి లేత పసుపురంగు లోకి మారుతుంది. ఈనెలు ఉబ్బి ఆకులు కిందకు ముడుచుకొని ఉంటాయి. పుష్పాలు వంధత్వంగా మారి నిటారుగా ఉంటాయి. మొక్కల పెరుగుదల ఆగిపోయి గిడసబారుతాయి.

యాజమాన్యం: మెటలాక్సిల్ 3 గ్రా. కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేయాలి. పంటపై మెటలాక్సిల్ (8 శాతం) 2 గ్రా. లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

–న్యూస్‌టుడే, దుగ్గొండి.


ఇల్లెందు సాంస్కృతికం: ఉట్టి కొట్టే వేడుకలో యువతుల కేరింతలు


ఖమ్మం నగరంలో...


ఇల్లెందు సాంస్కృతికం: ఉత్సాహంగా ఉట్టి కొడుతున్న యువకులు

కృష్ణం వందే జగద్గురుం

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు


పినపాక: గోపాలరావు పేటలో ఉట్టి కొడుతున్న యువకులు

శ్రీకృష్ణాష్టమి వేడుకలు సోమవారం కన్నుల పండువగా జరుపుకొన్నారు. పూర్వ ఖమ్మం జిల్లాలోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పలు పాఠశాలల్లో కృష్ణాష్టమి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. బాలబాలికలు గోపిక, కృష్ణుని వేషధారణలో ముద్దుగొలిపారు. గ్రామాల్లో సాయంత్రం ఉట్టికొట్టే వేడుకల్లో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, ఖమ్మం సాంస్కృతిక విభాగం


ఖమ్మం నగరంలో...


నేలకొండపల్లిలో...


అశ్వారావుపేట: ఉత్సాహంగా ఉట్టి కొడుతున్న యువకులు



సత్తుపల్లి పట్టణంలో చిన్నారుల నృత్యం


ఖమ్మం: న్యూరిడ్జ్ పాఠశాలలో వేడుకలో చిన్నారుల ఉత్సాహం


పాల్వంచ సాంస్కృతికం: పాల్వంచలోని ఓ పాఠశాలలో...

బతుకు నావకు దేవుడే దిక్కు!



నడి సంద్రంలో నావకైనా ఒడ్డుకు చేరాక పడవ కొట్టుకుపోకుండా ఉండాలన్నా దేవుడే దిక్కవాలన్నది జాలర్ల నమ్మకం. దీన్ని నిజం చేస్తున్నట్లు కనిపిస్తున్న ఈ దృశ్యాన్ని 'న్యూస్‌టుడే' కెమేరా సోమవారం క్లిక్‌మనిపించింది. భద్రాచలం గోదావరి స్నానాల రేవు వద్ద జాలర్లు తమ పడవలను ఒడ్డుకు చేర్చాక భద్రత కోసం బరువైన ఇనుప లంగరేస్తుంటారు. ఓ పడవకు లంగరు లేకపోవడంతో ఒడ్డు మీద ఉన్న నందీశ్వరుని రాతి విగ్రహాన్ని లంగరుగా చేసుకున్నారు. పడవకు ఉన్న తాడుని దీనికి కట్టారు. ఈ తరుణంలో అనుకోకుండా వరదొచ్చినా ఈ నావకు నందీశ్వరుడే దిక్కు అన్నట్లు కనిపించిందీ దృశ్యం.

- న్యూస్‌టుడే, భద్రాచలం

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా

కొత్తగూడెం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఈ నెల 13, 14 తేదీల్లో హైదరాబాద్‌లోని జీఎంసీ బాలయోగి మైదానంలో నిర్వహించిన రాష్ట్ర జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల క్రీడాకారులు అద్భుత ప్రతిభను ప్రదర్శించి పతకాలను కైవసం చేసుకున్నారు. ఉభయ జిల్లాలకు చెందిన 50 మంది అథ్లెట్స్ పోటీల్లో బరిలోకి దిగగా, 36 పతకాలను సాధించారు. వీటిలో 15 బంగారు, 3 వెండి, 18 కాంస్య పతకాలున్నట్లు ఖమ్మం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కె.మహిధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులను టీం మేనేజర్ టి.హనుమంతరావు, శిక్షకుడు గౌస్, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవీకె.మనోహర్, కోశాధికారి రాజేంద్రప్రసాద్ అభినందించారు.



పతకాలు సాధించిన ఉభయ జిల్లాల క్రీడాకారులు